


https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY




సంపుటి 10 | సంచిక 15 | కర్నూలు | శుక్రవారం 07 ఫిబ్రవరి 2025

పేజీలు : 08 | వెల రూ. 5.00

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi

## ప్రజల కళ్లకు గంతలు కట్టి అధికారాన్ని కాపాడుకున్నారు.. కాంగ్రెస్ పై ప్రధాని ఫైర్



న్యూఢిల్లీ(శ్రీచక్ర) : సుదీర్ఘ కాలం దేశాన్ని పాలించిన కాంగ్రెస్.. ప్రజల కళ్లకు గంతలు కట్టి తమ అధికారాన్ని కాపాడుకున్నారని ప్రధాని మోడీ అన్నారు. ఆ కాలంలో మరో విధానం గురించి ఆలోచించిన పరిస్థితి లేదని.. బుజ్జగింపు రాజకీయాలకే కాంగ్రెస్ నాయకులు ప్రాధాన్యం ఇచ్చారని మండిపడ్డారు. గురువారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం సందర్భంగా రాజ్యసభలో ప్రధాని ప్రసంగిస్తూ.. కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. సబ్ కా సాత్.. సబ్ కా వికాస్‌లో కాంగ్రెస్‌కు ఇబ్బంది ఏంటో అర్థంకావడం లేదన్నారు. దేశ ప్రజలందరికి సేవ చేసేందుకు మనం ఇక్కడున్నామని.. కానీ, ఫ్యామిలీ ఫస్ట్ అన్నదే కాంగ్రెస్ విధానమని.. నేషన్ ఫస్ట్ అనేది మా విధానమని చెప్పారు. "మూడోసారి దేశ ప్రజలు మాకు అవకాశం ఇచ్చారు. ఇంతపెద్ద దేశంలో మాకు మూడోసారి అవకశం దక్కిదంటే మా అభివృద్ధిని ప్రజలు అర్థం చేసుకున్నారు. మా డెవలప్‌మెంట్ మోడల్‌ను సమర్థించారు. మా హయాంలో సమయమంతా దేశ ప్రజల ప్రగతి కోసం వినియోగిస్తున్నాం. కేవలం అర్హులకే లబ్ధి చేకూరేలా పథకాలను రూపొందించి అమలు చేస్తున్నాం. పదేళ్లలో సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ మార్పును గమనిస్తున్నాం. ఎస్సీ, ఎస్టీలను బలోపేతం చేస్తున్నాం. ఓబీసీలకు కాంగ్రెస్ రిజర్వేషన్లు ఇవ్వలేదు. మేం వచ్చాక ఓబీసీల డిమాండ్‌ను నెరవేర్చాం. దేశంలో దివ్యాంగుల గురించి మిషన్ మోడ్‌లో పనిచేస్తున్నాం. దివ్యాంగుల కోసం ఎన్నో రకాల పథకాలు చేపట్టాం. ట్రాన్స్‌జండర్స్ గౌరవంతో బతికేలా చర్యలు తీసుకున్నాం" అని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

## విద్యుత్ ఛార్జీలు ఒక్క పైసా పెంచడానికి వీలు లేదు



అమరావతి, ఫిబ్రవరి 06:(శ్రీచక్ర) సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కేబినెట్ సమావేశం గురువారం అమరావతిలో జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలు చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. అలాగే పలు కీలక ఆదేశాలను ఈ సందర్భంగా ఉన్నతాధికారులకు సీఎం ఇచ్చినట్లు సమాచారం. 2019కు ముందు నీరు చెట్టు కింద ఉన్న నిధులు సుమారు రూ. 900 కోట్లు క్లియర్ చేయాలంటూ ఉన్నతాధికారులకు సిఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అలాగే 2019కి ముందున్న ఇళ్ళ బకాయిలు కూడా క్లియర్ చేయాలిని సూచించారు. ఈ బకాయిల కోసం పలువురు కార్యకర్తలు, నాయకులు మన చుట్టు తిరుగుతున్నారని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. అలాగే ఇన్‌ఛార్జ్ మంత్రులు.. జిల్లాలకు వెళ్ళినప్పుడు వీటిపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఇక ఈ సదస్సులో రెవిన్యూపై సుదీర్ఘ చర్చ జరిగింది. ఎవరైనా పనుల కోసం వచ్చినప్పుడు వారికి తేలికగా పనులు అయ్యే విధంగా చూడాలని మంత్రులకు సూచించారు. అదే విధంగా బోగస్ పాస్ పుస్తకాలు, రిజిస్ట్రేషన్లపై మంత్రులు, అధికారులు దృష్టి పెట్టాల్సిన అవశ్యకతను ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నొక్కి చెప్పారు. అలాగే రెనువబుల్ ఎనర్జీలో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారన్ని చెప్పారు. ఈ నేపథ్యంలో మనం గ్రౌండింగ్ మీద దృష్టి పెట్టాల్సి ఉందన్నారు. అనంతపురం జిల్లాలో కస్టమ్స్ విభాగం.. ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటుపై దృష్టి పెట్టమని వెల్లడించారుమన అధికారులకు సైతం ట్రైనింగ్ అవసరం ఉందన్నారు. ఇక్కడ కూడా మనం ఒక ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం అయితే ఉందని చెప్పారు. అధికారులు సైతం ఎప్పటికప్పుడు అప్డేట్ కావడానికి అవకాశం ఉంటుందన్నారు. సూర్య గర్, కుసుమ పథకాలు తీసుకొచ్చామన్నారు.

## లిక్కర్ కేసుకు మిథున్ రెడ్డికి సంబంధం లేదు : జగన్

అమరావతి: లిక్కర్ కేసులో మిథున్ రెడ్డికి ఏం సంబంధం ఏంటని ఆయన తండ్రి ఏ శాఖ మంత్రిగా ఉన్నారా? అని వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రశ్నించారు. ఈ సంధర్భంగా జగన్ మీడియాతో మాట్లాడారు. మిథున్ రెడ్డికి మద్యానికి సంబంధం ఏమిటని నిలదీశారు. ఎవర్నో ఒకర్ని ఇరికించడం కేసు పెట్టడం సరియైనది కాదని హితువు పలికారు. ఎవరైనా ఎందుకు డబ్బులు ఇస్తారని మండిపడ్డారు. మద్యం రేట్లు మేం పెంచామా?? మద్యం బేసిక్ రేట్లు పెంచి.. సరఫరా తగ్గంచిన తనకు లంచాలు ఇస్తారా? అని జగన్ బాధను వ్యక్తం చేశారు. మద్యం రేట్లు పెంచి సరఫరా పెంచిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మమూళ్లు ఇస్తారా? అని జగన్ దుయ్యబట్టారు. తన లాగా ఎందుకు చంద్రబాబు బటన్ నొక్కలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. తనకు డబ్బుపై వ్యామోహం లేదని, అందుకే డిబిటిలో రెండున్నర లక్షల కోట్లు



ఇచ్చామన్నారు. బయటకు వెళ్లే ప్రతి రాజ్యసభ సభ్యుడికి విశ్వసనీయత ఉండాలని, ప్రలోభాలకు లొంగో, భయపడో లేక రాజీపడో అటు పోతే విశ్వసనీయత సంగతేంటి? అని జగన్ అడిగారు. రాజకీయాల్లో కష్టాలు ఉంటాయని, ఐదేళ్లు కష్టపడితే మన టైం వస్తుందని, విశ్వసనీయత ముఖ్యమన్నారు. ఇది మాజీ ఎంపి విజయసాయిరెడ్డికైనా, మిగతావారికైనా వర్తిస్తుందని జగన్ దుయ్యబట్టారు.

## అక్రమవలస దారులకు సంకెళ్లు.. స్పందించిన విదేశాంగ మంత్రి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 07:(శ్రీచక్ర) అమెరికా అక్రమ వలసదారులను తిరిగి స్వదేశానికి పంపుతోన్న తరుణంలో.. వారి పట్ల ఆ దేశం వ్యవహరిస్తున్న తీరుపై రాజ్యసభలో ప్రతిపక్షాలు గురువారం తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ రాజ్యసభలో స్పందించారు. అక్రమ వలసదారులను స్వదేశానికి పంపడం నేడు కొత్తేమి కాదన్నారు. ఇది ఆ దేశ ప్రామాణిక విధానమని ఆయన తెలిపారు. విమానంలో వారిని తిరిగి తీసుకు వస్తున్న తరుణంలో వారి పట్ల అమర్యాదగా ప్రవర్తించడం మాత్రం సరికాదని మంత్రి జైశంకర్ అభిప్రాయపడ్డారు. విదేశాలల్లో చట్టవిరుద్దంగా నివసిస్తున్నట్లు తేలితే తమ పౌరులను తిరిగి తీసుకు రావడం అన్ని దేశాల ప్రాథమిక బాధ్యత అని మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. అయితే ఇలా దేశం నుంచి వెనక్కి పంపుతోన్న వారి పట్ల అమర్యాదగా ప్రవర్తించకుండా ఉండాలని.. అమెరికా అధికారులతో తాము సంప్రదింపులు జరుపుతోన్నట్లు ఆయన తెలిపారు. ఇక బహిష్కరణకు గురైన వారు అందించిన సమాచారం ఆధారంగా.. ఏజెంట్లు.. ఏజెన్సీలపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈ అంశంపై అమెరికా ప్రభుత్వంతో చర్చిస్తున్నామన్నారు. ఇదే సమయంలో.. చట్టబద్ధమైన ప్రయాణికులకు వీసాలను సులభతరం చేయడంతోపాటు .. అక్రమ వలసదారులపై కఠినమైన చర్యలు తీసుకోవడం ఉండాలన్నారు. అయితే మహిళలు, చిన్న పిల్లలతో ఈ విధంగా వ్యవహరించడం లేదని తమకు సమాచారం అందిందని తెలిపారు. మరోవైపు లోక్‌సభలో.. యూఎస్‌లో అక్రమంగా నివసిస్తున్న వారిని తిరిగి స్వదేశానికి పంపడంపై కాంగ్రెస్ ఎంపీలు మాణికం ఠాగూర్, గౌరవ్ గోగొయ్‌లతోపాటు కేసీ వేణుగోపాల్ ఇచ్చిన వాయిదా తీర్మానానికి సంబంధించి నోటీసులు అందజేశారు. అమృత్‌సర్‌లో బుధవారం సీ 17 యుద్ధ విమానంలో 104 మంది భారతీయ అక్రమ వలసదారులు యూఎస్ నుంచి తిరిగి వచ్చిన సంగతి తెలిసిందే. ఇంకోవైపు యూఎస్ నుంచి స్వదేశానికి తిరిగి వచ్చిన వలసదారుల చేతులకు సంకెళ్లు వేశారంటూ విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై ప్రతిపక్షాలు సైతం మండిపడుతోన్నాయి. అమెరికా నుంచి బహిష్కరణకు గురైన భారతీయుల పట్ల ప్రభుత్వం వ్యవహరించిన తీరును ప్రతిపక్ష పార్టీలకు చెందిన పలువురు ఎంపీలు విమర్శించారు. అక్రమ వలసదారుల పట్ల వ్యవహరించిన తీరు పట్ల ఈ సందర్భంగా వారు ప్రశ్నించారు. ఈ ప్రయాణంలో తమ చేతులకు సంకెళ్లు వేశారని.. అమృత్‌సర్ విమానాశ్రయానికి చేరుకున్న అనంతరం తమ చేతులకు ఉన్న సంకెళ్లు విప్పారంటూ అక్రమ వలసదారులు పేర్కొన్నారు. అదీకాక ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ ఎంపీలు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్‌తోపాటు ఇతర ప్రతిపక్ష ఎంపీలు అమెరికా అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకు నిరసనగా.. పార్లమెంట్‌లో ప్రదర్శన నిర్వహించారు.

## పాఠశాలలు బలోపేతం అయ్యేలా ప్రతిపాదనలు ఉండాలి:జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా





కర్నూలు, ఫిబ్రవరి 06 (శ్రీచక్ర): పాఠశాలలు బలోపేతం అయ్యేలా ప్రతిపాదనలు ఉండాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం పాఠశాలల బలోపేతం – రీస్ట్రక్చరింగ్ అంశం పై కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం, కర్నూలు నియోజకవర్గ స్పెషల్ అధికారులతో, డిప్యూటీ విద్యాశాఖాధికారులతో, మండల విద్యాశాఖాధికారులతో కలెక్టర్ కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మండల విద్యా శాఖాధికారులతో మాట్లాడుతూ విద్యా శాఖ రూపొందించిన గైడ్లైన్స్ ప్రకారం పాఠశాల విద్యా వ్యవస్థ బలోపేతం అయ్యేలా ప్రతిపాదనలను రూపొందించాలని సూచించారు.. ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం, కర్నూలు నియోజకవర్గాలకు సంబంధించిన క్లస్టర్ల వారీగా పాఠశాలలు, విద్యార్థుల వివరాలను మండల విద్యా శాఖాధికారులను అడిగి తెలుసుకున్నారు..సమావేశంలో కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్ర బాబు, డిఈఓ శామ్యూల్ పాల్, డిఆర్డిఎ పిడి నాగశివలీల, డి పి ఓ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు..

## ఎన్ హెచ్ ఏ ఐ నుండి 67.16 కోట్ల ప్రాజెక్టును పొందిన హజూర్ మల్టీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్

హైదరాబాద్, 06 ఫిబ్రవరి 2025: (శ్రీచక్ర) ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఇపిసి) కాంట్రాక్టింగ్ సేవలలో ప్రముఖ సంస్థ అయిన హజూర్ మల్టీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ (హెచ్‌ఎంపిఎల్) (బిఎస్‌ఇ: 532467) కు, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్ హెచ్ ఏ ఐ) నుండి ఒక కీలక ప్రాజెక్ట్ లభించింది. కంపెనీకి హులికుంటే ఫీ ప్లాజా వద్ద (సిహెచ్. 12.300) వినియోగదారుల రుసుము వసూలు సంస్థగా వ్యవహరించే అధికారం ఈ–టెండర్ ద్వారా పోటీ ధరపద్ధతిలో ఎల్‌ఓఏ (లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్స్) రూపంలో లభించింది. ఈ ప్రాజెక్ట్ విలువ రూ. 67.16 కోట్లు. ఇది కర్ణాటకలోని దోబస్పేట్ నుండి దొడబళ్ళాపురం బైపాస్ వరకు (ఎన్ హెచ్ 648, పాత ఎన్ హెచ్–207) నాలుగు లేన్ల రహదారి విస్తరణ ప్రాజెక్టుకు సంబంధించినది. ఇటీవల, సంస్థ తన బోర్డు స్వేర్ పోర్ట్ షిప్‌యార్డ్ ప్రైవేట్ లిమిటెడ్ ను హజూర్ మల్టీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్‌తో విలీనం చేయడానికి సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. ఈ విలీనం ద్వారా వ్యాపార సామర్థ్యాలను సమీకరించడం, మరియు అన్ని ప్రయోజనదారులకు మెరుగైన లాభదాయకత అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. భారతదేశంలోని అభివృద్ధి చెందుతున్న మౌలిక సదుపాయాల రంగంలో హెచ్‌ఎంపిఎల్ ప్రముఖ స్థానాన్ని కలిగి ఉంది. సంస్థ ఎంఎస్‌ఆర్డిసి సహా అనేక ముఖ్యమైన ప్రాజెక్టులను ఇపిసి మరియు హైబ్రిడ్ అన్యుటీ మోడల్ ద్వారా విజయవంతంగా పూర్తిచేసింది. 2019లో వాకన్–పాలి హైవే నిర్మాణాన్ని, కోవిడ్–19 సవాళ్లను ఎదుర్కొంటూ, విజయవంతంగా పూర్తి చేసింది. అంతేకాక, సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వే ప్యాకేజీ 11, ఎన్ హెచ్ 48 హైవే ప్రాజెక్ట్ వంటి ప్రతిష్టాత్మక పనులను చేపట్టి తన నైపుణ్యాన్ని నిరూపించింది. తాజాగా, సంస్థ మౌలిక వనరుల ఇపిసి కాంట్రాక్టింగ్ విభాగంలో మరింత విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో ఇపిసి కాంట్రాక్టులను దృష్టిలో ఉంచుకుని, ప్రొఫెషనల్ సేవలను అందించేందుకు హెచ్‌ఎంపిఎల్ సిద్ధంగా ఉంది. దేశీయంగా మరియు అంతర్జాతీయంగా మౌలిక వనరుల రంగంలో మరింత పురోగమించేందుకు ఈ ప్రాజెక్ట్ కీలకమైన మైలురాయి కానుంది.

# సంపాదకీయం

## రూపాయికి ఏమైంది.....

డాలర్ చుట్టూ ప్రపంచం తిరుగుతోంది. కొన్ని దేశాల్లో లోకల్ కరెన్సీ ఎన్ని కోట్లయినా ఒక్క డాలర్ ముందు దిగదుడుపే. కొన్ని ఆఫ్రికన్ కంట్రీస్ కి ఎవరైనా ఫారినర్స్ వెళ్తే లోకల్ కరెన్సీ కంటే డాలర్లే కావాలంటారు. అట్లుంటది డాలర్ తోని. ఇంటర్నేషనల్ గా ఏ ప్రాబ్లమ్ వచ్చినా గిరాకీ పెరిగేది డాలర్ కే. యుద్ధాలైనా, రోగాలైనా.. పాండమిక్ అయినా, ఎండమిక్ అయినా.. ఏవైనా సరే అంతా అప్పుడు డాలర్, బంగారాన్నే నమ్ముకుంటారు. డాలర్ కు భద్రమైన, ఎక్కడైనా చెల్లే కరెన్సీగా నమ్మకం ఉండడం వల్లే ఇది జరుగుతోంది. డాలర్‌ను వదిలించుకోవడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా మనలాంటి దేశాలకు వర్కవుట్ కావడం లేదు. అయితే డాలర్‌పై అతిగా ఆధారపడాల్సిన పరిస్థితిని మాత్రం తగ్గించుకునే రూట్లు వెతుక్కునే పనిలో భారత్ సహా మరికొన్ని దేశాలు ఉన్నాయి. అలా చేసినా ట్రంప్ కు కోపం పెరుగుతోంది. ఆల్టర్నేట్ కరెన్సీ కోసం చూస్తున్న దేశాలను టార్గెట్ చేసి మరీ ఎక్కడ కొట్టాలో అక్కడే గురి చూసి కొడుతున్నారు ట్రంప్. రూపాయి వాల్యూ పెరగాలన్నా, తగ్గాలన్నా కంటికి కనిపించేవి, కనిపించని ఫ్యాక్టర్స్ ఎన్నో బ్యాక్ గ్రౌండ్ లో పని చేస్తూ ఉంటాయి. ప్రెజెంట్ సిచ్యువేషన్ ఎలా ఉందంటే.. డాలర్ తో పోలిస్తే రూపాయి వాల్యూ తగ్గినా పరేషాన్? తగ్గకపోయినా పరేషాన్ అన్నట్లుగా ఉంది. ఎందుకంటే పడితే ఒకరికి లాభం. పెరిగితే మరొకరి భారం. చెప్పాలంటే ఇంటర్నేషనల్ ఇన్వెస్టర్ల మధ్య రూపాయి నలిగిపోతోంది. అందుకే ఇప్పుడు డాలర్ విలువ 87 రూపాయల 8 పైసలుగా నమోదైంది. ఇది రూపాయి చరిత్రలోనే ఆల్ టైమ్ లో. ఒక్క డాలర్ 87 రూపాయలు అంటే తేలిగ్గా తీసుకోవడానికి లేదు. రంగంలోకి దిగాల్సిన పరిస్థితే కనిపిస్తోంది. అమెరికన్ డాలర్ తో పోలిస్తే రూపాయి వాల్యూ ఇంతలా తగ్గడానికి చాలా కారణాలు ఉన్నాయి. ప్రెజెంట్ అయితే సిచ్యువేషన్ ను అబ్జర్వ్ చేస్తోంది ఆర్బీఐ. ఒక అంచనా ప్రకారం ఈ ఏడాది చివరి నాటికి ఒక డాలర్ వాల్యూ 90 రూపాయలకు చేరుతుందనీ అంటున్నారు. అలాగే సర్దుకుపోవడమా.. చక్రం తిప్పడమా అన్నది ఆర్బీఐ, మార్కెట్లు, ప్రభుత్వం చేతిల్లోనే ఉంటుంది. ఎందుకంటే అంతర్జాతీయ మార్కెట్ లో ఏ పని చేయాలన్నా డాలర్ల రూపంలోనే చేయాలి. సో మన రుపీస్ ను ఎక్కువగా ఖర్చు చేయాలి. దీంతో ఒత్తిడి సహజంగానే పెరుగుతుంది. ప్రెజెంట్ రుపీ సిచ్యువేషన్ ను కేంద్రం అబ్జర్వ్ చేస్తోంది. అమెరికా డాలర్ విలువ 87ను దాటినా ఎలాంటి టెన్షన్ అవసరం లేదని ఆర్థిక శాఖ కార్యదర్శి తుహిన్ కాంత పాండే అంటున్నారు. రూపాయి చుట్టూ జరుగుతున్న ఫ్యాక్టర్స్ పై ఆర్బీఐ ఫోకస్ పెంచిందంటున్నారు. డాలర్ తో పోలిస్తే రూపాయి ఎందుకు ఇంత క్షీణిస్తోందన్న మ్యాటర్ పై ఫోకస్ పెట్టి కొన్ని విషయాలు గుర్తించారు. ఫారిన్ ఇన్వెస్టర్లు దేశీయ స్టాక్స్ అమ్మేసి, నిధులు తీసుకెళ్లిపోతున్నారు. అందుకే రూపీ మారకపు రేటుపై ఒత్తిడి పెరుగుతోందంటున్నారు ఆర్థిక శాఖ కార్యదర్శి. అమెరికా ఆర్థిక వ్యవస్థ స్ట్రాంగ్ గా మారి ఉద్యోగ కల్పన పెరిగింది. నిరుద్యోగం తగ్గింది. సో అక్కడి వడ్డీ రేట్లు నిలకడగా ఉన్నాయి. అందుకే ఫారిన్ ఇన్వెస్టర్లంతా అమెరికా డాలర్ బాండ్లలో పెట్టుబడి పెట్టడానికి ఇంట్రెస్ట్ చూపుతుండడంతో మనలాంటి దేశాల నుంచి ఇన్వెస్ట్ మెంట్స్ తీసేసి అక్కడ పెడుతున్నారన్న మాట. జనవరిలో ఏకంగా 48 వేల కోట్లు వెనక్కు పట్టుకెళ్లారు. దీంతో డాలర్ కు డిమాండ్ పెరిగి, రూపాయి డౌన్ అవుతోంది. అటు ముడి చమురు రేట్లు పెరగడం, దాంతో పాటే మన బిల్లు కూడా పెరిగి రూపాయిపైనే ఒత్తిడి పడుతోంది. ఇదే కాదు మనదేశంలో ద్రవ్యోల్బణం పెరిగింది. ఆర్థిక పరిస్థితులు బాగా లేవు. ఇది మరో కారణం. అటు రుపీ వాల్యూ తగ్గడంపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా పార్లమెంటుకు లేటెస్ట్ గా జవాబు ఇచ్చారు. రూపాయి విలువను మార్కెట్టే నిర్ణయించాలన్నారు. డాలర్‌తో పోలిస్తే, రూపాయి వాల్యూ ఇంతే ఉండాలన్న టార్గెట్ ఏమీ పెట్టుకోలేదన్నారు. సో సెంట్రల్ గవర్నమెంట్ స్టాండ్ క్లియర్ గా ఉంది. లెట్స్ వెయిట్ అండ్ సీ అని చూస్తున్నారు. మనదేశం చమురు అవసరాల కోసం చాలా వరకు దిగుమతుల పైనే ఆధారపడుతోంది. అలాగే ఎలక్ట్రానిక్ గూడ్స్, యంత్ర పరికరాలనూ చాలా వరకు దిగుమతి చేసుకోవాల్సిందే. వాటన్నింటికీ డాలర్లలోనే చెల్లింపులు జరపాలి. అలా చేయడం వల్ల మన ఆర్థిక పారిశ్రామిక అభివృద్ధిపై ఎఫెక్ట్ పడుతుంది. అలాగే దిగుమతి చేసుకునే వంట నూనెలు, సహజవాయువు, బంగారం, లగ్జరీ కార్లు, గడియారాలు కొనాలన్నా చాలా మోతెక్కిపోతాయి. ద్రవ్యోల్బణం పెరిగి, ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతుంది. దీని ఫలితంగా నిత్యావసరాల ధరలు పెరుగుతాయి. ఫారిన్ కరెన్సీలో లోన్లు తీసుకున్న కంపెనీలకు భారం పెరుగుతుంది. వడ్డీ, అసలు తిరిగి చెల్లించడం చాలా కష్టమవుతుంది. దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే వ్యాపార సంస్థల లాభాల్లో కోత పడుతుంది. ఖర్చులు తడిసిమోపెడవుతాయి. స్టాక్‌మార్కెట్లలో తీవ్ర ఒడిదొడుకులతో ఇన్వెస్టర్లకు భారీ నష్టాలు తప్పవు. ఇవే కావు.. విదేశాల్లో ముఖ్యంగా అమెరికా వంటి దేశాలకు ఉన్నత చదువుల కోసం తమ పిల్లలను పంపే తల్లిదండ్రులపై భారం చాలా పెరుగుతుంది. యూనివర్సిటీ ఫీజులు, పిల్లల రోజువారీ ఖర్చుల కోసం ఎక్కువ రూపాయలు పెట్టి వాటిని డాలర్లుగా మార్చి పంపాలంటే తడిసి మోపెడవుతుంది. ఇది భారతీయ తల్లిదండ్రులకు పెను భారమే. లోన్లు, ఇతర అప్పులు ఎక్కువ చేయాల్సి వస్తుందన్న మాట. డాలర్ తో రూపాయి విలువ తగ్గితే మన దేశం నుంచి వస్తువులు, సర్వీసెస్ ఎక్స్ పోర్ట్స్ చేసేవారికి మాత్రం లాభం జరుగుతుంది. మన దేశం నుంచి ఐటీ సేవల ఎగుమతులు చాలా ఎక్కువ. మెడిసిన్స్, వజ్రాభరణాలు, దుస్తులు, ఇంజినీరింగ్ విడిభాగాలు, ఉత్పత్తులు ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయి. ఈ రంగాల కంపెనీలు మాత్రం ఎక్కువ ఆదాయాలు, లాభాలు నమోదు చేసే వీలుంటుంది. అంటే రూపాయి విలువ తగ్గితే అంతర్జాతీయ మార్కెట్లో మన ఎగుమతులు చాలా తక్కువ ధరలకు లభించి సరకులకు గిరాకీ పెరుగుతుంది

# డాక్టర్ ప్రభాకర్ రెడ్డి కి ఘనంగా పౌర సన్మానం



కర్నూలు, ఫిబ్రవరి 6 (శ్రీచక్ర): ప్రాణాపాయ స్థితిలో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు చేరుకొని కార్డియోథోరాసిక్ సర్జన్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి క్లిష్టమైన గుండె ఆపరేషన్ చేయడం వలన సంతోషంగా జీవిస్తున్నామని అందువల్లే వారిని ఘనంగా సన్మానించుకుంటున్నామని పలువురు సర్జరీ చేయించుకున్న రోగులు గురువారం కర్నూలు నగరం లోని బిర్లా కాంపౌండ్ యందలి కృష్ణకాంత్ ప్లాజాలోని డా. బ్రహ్మారెడ్డి సమావేశం మందిరం యందు కార్డియోథోరాసిక్ సర్జన్ డాక్టర్ సి ప్రభాకర్ రెడ్డిని ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఒంటరిగా వచ్చాం ఒంటరిగానే పోతామని వెంట తీసుకుపోయేదేమీ లేదని ప్రతి మనిషికి జీవించే హక్కు ఉందని క్లిష్టమైన గుండె సమస్యలతో మరణం సంభవించే పరిస్థితులు ఏర్పడినప్పుడు వారి జీవన హక్కును కాపాడే బాధ్యత తీసుకుని ఒక ప్రభుత్వ డాక్టర్ గా దాదాపు వెయ్యి కి గ పైగా గుండె ఆపరేషన్ లు చేశానని ఎంతో తృప్తి గా ఉందని నేడు ఆ సేవల వల్ల సంతోషంగా జీవనం సాగిస్తున్న వారు తనకు సన్మానం చేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది అని తెలిపారు. క్లిష్టమైన ఆపరేషన్లు విజయ వంతంగా నిర్వహించడం అనే కిక్కు వేరే వుంటుంది అని అది ఆపరేషన్ నిర్వహించిన డాక్టర్ కే తెలుస్తుందని అన్నారు. కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో కార్పొరేట్ హాస్పిటల్ కు దీటుగా కార్డియోథోరాసిక్ విభాగాన్ని తీర్చిదిద్దామని అది నేడు వందల మందికి ప్రాణదానం చేస్తుందని తెలిపారు. తాను నిర్వహించిన క్లిష్టమైన సర్జరీల్లో తనకు ఎంతో సపోర్టుగా నిలిచిన అసిస్టెంట్లను నర్సింగ్ సిబ్బందిని వారి సేవలు ఎంతో గొప్పవని వారు ఎంతో గొప్పగా సేవలు అందిస్తున్నారు అని కొనియాడారు. డాక్టర్ వి. బ్రహ్మ రెడ్డి మాట్లాడుతూ ఆపరేషన్లు చేయడం ఒక కళయని అందులో స్వతహాగా ఆసక్తి ఉన్నవారే క్లిష్టమైన ఆపరేషన్లను చాలెంజ్ గా తీసుకుంటారని అందులో డాక్టర్ సి ప్రభాకర్ రెడ్డి ప్రముఖులని వారి ద్వారా కొన్ని వేల గుండె ఆపరేషన్లు ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా ప్రజలకు అందడం అన్నది ఎంతో హర్షించదగ్గ విషయం అన్నారు. నరసరావుపేట కు చెందిన నరసింహా రెడ్డి,కర్నూలు కు చెందిన విశ్వేశ్వరయ్య, శంకర్రావు కుటుంబ సభ్యులు బ్రేక్ ఇన్స్పెక్టర్ క్రాంతి తదితరులు మాట్లాడుతూ గుండె జబ్బులతో క్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్న మాకు డాక్టర్ ప్రభాకర్ రెడ్డి గారి సర్జరీ వల్ల పునర్జన్మ లభించినట్లు అయిందని నేడు సంతోషంగా జీవిస్తున్నామని ప్రభుత్వాసుపత్రిలో కూడా ఇలాంటి సేవలు దొరకడం అన్నది నిజంగా సంతోషంగా ఉందని అందుకే వారిని ఘనంగా సన్మానించుకుంటున్నామని వారు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేట్ విత్ గ్రీన్ సొసైటీ అధ్యక్షులు అడ్వకేట్ శ్రీరాములు, హంద్రీ పరిరక్షణ సమితి నాయకులు రామకృష్ణారెడ్డి, డాక్టర్ ఇస్మాయిల్, ప్రతాప్ రెడ్డి, కవి ఎలమర్తి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ ఉద్యోగమే సంస్థ అభివృద్ధికి మూలం

### బద్వేలు మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ శేఖర్ రావు..

బద్వేలు ఫిబ్రవరి 6 బద్వేల్ ఆర్టీసీ డిపో ఆవరణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రోడ్డు భద్రతా ఉత్సవాల సందర్భంగా ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ జరిగినది ఈ కార్యక్రమం బద్వేలు డిపో మేనేజర్ ఆర్ సి నిరంజన్ ఆధ్వర్యంలో జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బద్వేల్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శేఖర్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని ఉద్యోగులను గూర్చి మాట్లాడడం జరిగింది. ఆదర్శంగా ఉద్యోగం చేయడం వలనే సమస్త అభివృద్ధి పథంలో పయనిస్తుందని భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని సమస్త మనుగడ కోసం ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేయవలసిన అవసరం ఎంతైనా ఉందని తద్వారా సంస్థఅభివృద్ధి బాటలో పయణినించిభవిష్యత్ తరాలకు ఉద్యోగఅవకాశాలు కల్పించే అవకాశం ఉంటుందని తద్వారా కొంతవరకు నిరుద్యోగం తగ్గే అవకాశం ఉంటుందని అన్నారుసంస్థలో వారి వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించినప్పుడేసంస్థకుమనుగడ సాధ్యమని వ్యాఖ్యానించారుడిపో మేనేజర్ నిరంజన్ మాట్లాడుతూ ఉద్యోగుల సమిష్టి కృషి ఫలితమే మనం ఈ పీకే లోను మరియు కేఎంపిఎల్ లోనూ అలాగే సంక్రాంతి స్పెషల్ బస్సులు తిప్పడంలోనూ రెండవ స్థానంలో ఉన్నామని ఆ కృషి ఫలితం ఉద్యోగులకే చెందుతుందని ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో బాధ్యతాయుతంగా నడుచుకోవడం మూలానే మనం ముందుకు పోతున్నామని అలాగే ఎప్పటికప్పుడు బస్సులను కండిషన్లలో ఉంచుతూ సహకరిస్తున్న మెకానిక్ లు ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని బస్సులను ఏర్పాటు చేయడంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ బిఎస్ నాయక్ కృషి ఎనలేని దని అలాగే కంట్రోలర్లు సిస్టం సూపర్వైజర్ ఇందులో భాగస్వామ్యం కావడం స్వాగతించదగ్గ విషయం అన్నారు అనంతరం ఆదర్శ ఉద్యోగులుగా ఎంపిక కాబడిన ట్రిమ్ డ్రైవర్లు కండక్టర్లు మెకానికులు కంట్రోలర్ లు లీడింగ్ హ్యాండ్ సిస్టం సూపర్వైజర్ శ్రామిక్ లకు ఎం వి ఐ చే ప్రశంసా పత్రాలు అందించడం జరిగిందిఈ కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో ఉద్యోగులు అసోసియేషన్ నాయకులు కండక్టర్లు డ్రైవర్లు మెకానిక్లు సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు

# గొప్ప స్ఫూర్తిప్రదాత ఆదర్శమూర్తి రమాబాయి అంబెడ్కర్

### -నేడు ఆమె జయంతి



రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సతీమణి రమాబాయి అంబెడ్కర్. ఈవెం ఫిబ్రవరి 7న,1898 లో జన్మించింది. మాత రమాబాయి ప్రపంచ మేధావిని తీర్చిదిద్ది దేశానికే దీపమయ్యారు. రమాభాయి బాబా సాహెబ్ ను గుర్తించినంతగా తన స్వంత జాతి ప్రజలు బాబా సాహెబ్ విజయాలకు కారణమైన రామబాయిని గుర్తించలేదనే చెప్పాలి. తన త్యాగాల పునాదుల మీద బాబా సాహెబ్ ని ఒక మేను పర్వతంగా తాను నిలబెట్టింది. డాక్టర్ అంబేద్కర్ గారి ఒకొక్క మెట్టు వెనుక రమాబాయి అమ్మ పంటి బిగువున బిగపట్టిన బాధ తాలూకు గాయలున్నాయి. బాబా సాహెబ్ ఇదంతా గుర్తించారు. ఆమెకు గుర్తుగా 1941 ఆయన వ్రాసిన 'థాట్స్ ఆన్ పాకిస్తాన్' పుస్తకాన్ని అంకితమిచ్చారు. అతి తొందరగా "నా "అనుకునే వారిని పోగొట్టుకున్న రమాబాయితో బాబా సాహెబ్ వివాహం 1906 లో బైకుల్లా మార్కెట్ లో జరిగింది అప్పుడు బాబా సాహెబ్ కి పద్నాలుగు ఏళ్ళు, రమాబాయికి తొమ్మిది ఏళ్ళు. అతి చిన్నవయసులోనే వివాహం జరగడం వలన రమాబాయి చదువుకు దూరం అయ్యింది. బాబా సాహెబ్ తనకు చదువు చెప్పించాలని ప్రయత్నం చేయడం జరిగింది, ఈ ప్రయత్నంలో ఆమె కొద్దిగా వార్త పత్రికల హెడ్ లైన్ లు చదవవలగడం నేర్చుకుంది. తన పెళ్లి తరువాత బాబా సాహెబ్ మెట్రిక్యులేషన్ పాస్ అయ్యారు. డాక్టర్ అంబెద్కర్ గారికి ఎల్లవేళలా తోడుంటూ ఎన్నో కష్టాలను ఓర్చుకుంటూ జీవనం సాగించడం జరిగింది. ఉన్నత చదువులకు బరోడా రాజు ప్రోద్బలం తో బాబా సాహెబ్ లండన్ వెళ్లడం జరిగింది. ఆ సమయంలో ఇంటి బాధ్యతలు రమాబాయి ఒక్కరే నెరవేర్చుకున్నారు. బాబా సాహెబ్ ఉన్నత చదువులకోసం తాను ఎన్నో బాధలను అనుభవించింది. ఇల్లు గడవని స్థితిలో రమాబాయి పిడకలు చేసి అమ్మేవారు ఆ డబ్బులతో ఇల్లు గడిచేలా చూడటమే కాకుండా అందులో కొంత డబ్బు డాక్టర్ అంబెడ్కర్ కి పంపించేవారు. ఆమె జీవిత కాల కష్టమే ఈ రోజున రాజ్యాంగం ద్వారా హక్కులు అణగారిన వర్గాల ప్రజలు అనుభవిస్తున్నారని అనడంలో సందేహం లేదు. ఈ విషయాలు స్వయంగా డాక్టర్ అంబెడ్కర్ గారు 3 ఫిబ్రవరి 1928 న బహిష్కృత భారత్ పక్ష పత్రికలో తన సంపాదకీయంలో రాశారు. ఒకొక్కరుగా తన బిడ్డలు రాలి పోతున్నా మొక్కవోని ధైర్యం రమాబాయి సొంతం, ఎంతటి బాధనైన తన గుండెల్లోనే దాచుకుని బాబా సాహెబ్ కి ధైర్యాన్నీ నూరిపోసేవారు. 1907 నుండి మొదలయిన బాబా సాహెబ్ చదువు ప్రస్థానం 1953 ఉస్మానియా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ తో ముగిసింది. ఇవి సాధించటానికి వాళ్ళు ఇద్దరూ కారణమే, ఈ ప్రతీ చదువు వెనుక రమాబాయి త్యాగం ఉంది. బాబా సాహెబ్ లండన్ కి వెళ్తున్నపుడు రమాబాయి గర్భవతిగా ఉంది. రమాబాయి అమ్మ యొక్క కుమారుడు 'రమేష్' చనిపోయారు, 'గంగాదర్' చనిపోయారు, ఒక్కగానొక్క ఆడ కూతురు 'ఇందు' చనిపోయారు, చివరివారు బాబా సాహెబ్ కి అత్యంత ఇష్టుడు చిన్నవాడు అయినా 'రాజ్ రతన్' కూడా చనిపోయాడు, యశ్వంత్ అంబేద్కర్ ఒక్కరే మిగిలాడు. బాబా సాహెబ్ జీవితం అంటే పోరాటం ఆ పోరాటంలో తనతో పాటు రమాబాయి అమ్మకూడా తన వంతు పనిచేసింది. రమాబాయికి చదువు విషయంలో బాబా సాహెబ్ ని చూసి గర్వపడేది. అసమాన ఆయన ప్రతిభను చూసి నివ్వెర పోయేది. సమానత్వం కోసం ఆయన పడుతున్న తపనకు చలించిపోయేది. ఇదంతా చేస్తూ ఆయన ఆరోగ్యనీ కాపాడుకోలేక పోతున్నారు అంటూ అనుక్షణం తపన పడేది. రమాబాయి అమ్మ అంటే త్యాగనీ, రమాబాయి అమ్మ అంటే ఒక పోరాటం, చివరకు 1935 మే 27న ఆమె తుదిశ్వాస విడిచారు. ఆమె మరణించిన తర్వాత అంబేద్కర్ కన్నీరుమున్నీరుగా విలపించారు. చివరకు సన్యాసం తీసుకోవాలని భావించారు. ఎంతోమంది మిత్రులు నచ్చచెప్పి అంబేద్కర్‌ని మామూలు మనిషిగా మార్చారు. ఈవిధంగా కటికదారిద్ర్యంలో జీవితం కొనసాగించిన రమాబాయి ఏ రకమైన ప్రలోభాలనూ తన దరిదాపుల్లోకి రానివ్వలేదు. తన భర్త బారిష్టరైనా ఆమె పిడకలు వేసి సంసారాన్ని నడిపించారు.

# ఎన్నికల కోడ్ను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలి

### జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం,ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషను వెలువడవడంతో జిల్లాలో ఎన్నికల కోడ్ను కఠినంగా అమలు చేయాలని, ఎన్నికల కోడ్ ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషను నోటిఫికేషను వెలువవడంతో ఎన్నికల నిబంధనలు, ప్రవర్తనా నియమావళిని జిల్లాలో ఖచ్చితంగా అమలు చేయాలని, ఎన్నికల కోడ్ ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ మార్చి 8వరకు అమలులో ఉంటుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు,ప్రాంగణాల్లోను, పబ్లిక్ ప్రదేశాల్లో రాజకీయ నాయకులు ఫోటోలు ఉన్న ఫ్లెక్సీలు లేకుండా చూడాలని, విగ్రహాలకు ముసుగులు వేసే విధంగా మున్సిపల్, పంచాయతీ, రెవెన్యూ అధికారుల సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీ పోలీసు స్టేషను పరిధిలో తుపాకుల లైసెన్సులు వున్న వ్యక్తుల నుండి ఆయుధాలను డిపాజిట్ అయ్యే విధంగా చూడాలన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని నాన్ బెయిలబుల్ వారెంట్లను ఎగ్జిక్యూటివ్ చేయాలని, ఇందుకు బృందాలనుప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. గ్రామాల్లో బెల్టు షాపులు లేకుండా చూడాలని, విస్తృతంగా దాడులు నిర్వహించాలని, మద్యంను అక్రమంగా విక్రయించే వారిపై కేసులు నమోదు చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. రాత్రి బీట్లును, పగటి బీట్లును వేయాలని, గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలను ముందుగా గుర్తించి, ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. దత్తత గ్రామాల్లో పోలీసు సిబ్బంది వారంలో రెండుసార్లు సందర్శించి, క్షేత్ర స్థాయిలో సమాచారాన్ని సేకరించి, ఉన్నతాధికారులకుఎప్పటికప్పుడు అందించాలని పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు.

# అసెంబ్లీకి రాను...ఏం చేసుకుంటారో చేసుకోండి

విజయవాడ, ఫిబ్రవరి 6, (న్యూస్ పల్స్)కూటమి ప్రభుత్వం హయాంలో అప్పులు పెరుగుతున్నాయే తప్ప ప్రజలకు జరిగిన మేలు ఏం లేదని చెబుతూ ప్రెస్‌మీట్ పెట్టిన జగన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు చేస్తున్న అప్పులు, తప్పులు కారణంగా రాష్ట్రం ప్రతిష్ట దిగజారుతుందని అన్నారు. ఈ అప్పులతో తన సంపద పెంచుకుంటున్న చంద్రబాబు ప్రజలను గాలికి వదిలేశారని ఆరోపించారు. ఇలాంటి వ్యక్తికి మళ్లీ ప్రజలు ఎందుకు ఓటు వేస్తారని ప్రశ్నించారు. అందుకే తాము అధికారంలోకి వస్తున్నామని చెప్పానని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు కార్యకర్తలను పట్టించుకోలేకపోయానని ఈసారి కచ్చితంగా కార్యకర్తలనను పట్టించుకుంటామని జగన్ హామీ ఇచ్చారు. వారిని చంద్రబాబు పెడుతున్న బాధలు చూసిన తర్వాత అండగా ఉండాలని నిర్ణయించామన్నారు. ఎలాంటి తప్పులు లేకపోయిన వారిపై కేసులు పెట్టి జైల్లో పెడుతున్న వారితో కార్యకర్తలకు సెల్యూట్ చేయించడంలో తప్పేముందని ప్రశ్నించారు. అలా చేయకుండా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మధ్య కాలంలో పార్టీ మారుతున్న వారిపై అడిగిన ప్రశ్నకు జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. సాయి రెడ్డి కావచ్చు వెళ్లిపోయిన వాళ్లు కావచ్చు. వెళ్లబోయే వాళ్లు కావచ్చు. ఎవరికైనా వ్యక్తిత్వం ముఖ్యమని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బెదిరింపులు, ప్రలోభాలు కామన్‌గా ఉంటాయని వాటికి నిలబడిన వాళ్లనే ప్రజలు గుర్తు పెట్టుకుంటారని అన్నారు. అలా కాకుండా వాటికి భయపడి వెళ్లిపోయిన వాళ్లను పట్టించుకోరని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఓపిక అవసరమని అన్నారు జగన్. ఇలా దేనికో ఒకదానికి లొంగిపోయి పార్టీలు వీడితే గౌరవం ఉంటుందా అని ప్రశ్నించారు. క్యారెక్టర్, క్రెడిబిలిటీ ఉండాలని అన్నారు. ఐదేళ్లు కళ్లు మూసుకుంటే గడిచిపోతాయని తర్వాత మంచి రోజులు వస్తాయన్నారు. కచ్చితంగా ఈ ప్రభుత్వం పోతుందని ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఉన్నవి రెండు పార్టీలేనని ఒకటి అధికార పక్షం రెండోది ప్రతిపక్షం. ప్రతిపక్షంలో ఉన్నది ఒకటే పార్టీ. అలాంటి పార్టీకి ప్రతిపక్ష హోదా ఇవ్వడానికి ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు జగన్. ఈ వివాదం కోర్టులో ఉందని స్పీకర్‌కు నోటీసులు ఇచ్చినా స్పందించడం లేదని అన్నారు. ముందు ఆయన స్పందిస్తే తమ నిర్ణయం చెబుతామని అన్నారు. సభలో తగినంత సమయం ఇవ్వబోరని అందుకే వెళ్లడం లేదని అన్నారు. ప్రెస్‌మీట్‌లో కావాల్సినంత టైం ఉన్నది కాబట్టే పూర్తి వివరాలు ప్రజల ముందు ఉంచామని అన్నారు. 9 నెలల పాటు జరిగిన తప్పులు ప్రజల ముందు ఉంచామని వాటిపై అటు నుంచి సమాధానం చెప్పాలని అన్నారు. ఇలాంటి అంశాలపై చర్చలు జరగాలంటే ఎదురెదురుగా ఉంటేనే సాధ్యం అవుతుందని అనుకోవద్దని అన్నార జగన్. అసెంబ్లీకి వెళ్లకపోతే వేటు వేస్తారు కదా అన్న మాటకు ఏం చేసుకుంటారో చేసుకోమని అన్నారు జగన్. తాము అసెంబ్లీని బహిష్కరించడం లేదని వాళ్లే రావద్దని చెబుతున్నారని కొత్త పాయింట్ తీసుకొచ్చారు.

# ముగ్గురు బైకు దొంగలు అరెస్టు

అమలాపురం,మోటార్ సైకిళ్ళను చోరీ చేస్తున్న ముగ్గురు అంతర్ జిల్లా దొంగలను అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. వీరితో పాటు మరో ముగ్గురు మైనర్ బాలురను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులనుంచి 13 మోటార్ సైకిళ్ళు, మూడు ఎక్సైడ్ బ్యాటరీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు మేకల వీర వెంకట శ్రీరామ మూర్తి, వీరమల్లు శశి కుమార్, దొంగ లోకేష్ లు అంబేద్కర్ కోనసీమ జిల్లా, విశాఖ జిల్లాలో పలు స్టేషన్ల పరిధిలో మోటార్ సైకిళ్ళను చోరీ చేశారని అమలాపురం డీఎస్పీ టీ ఎస్ ఆర్ కె ప్రసాద్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న మోటార్ సైకిళ్ళు, బ్యాటరీల విలువ 8 లక్షల 82 వేల రూపాయలని డీఎస్పీ తెలిపారు.

# ఇక జగన్ 2.0



విజయవాడ, ఫిబ్రవరి 6, ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇప్పటి నుండి మరో లెక్క.. నాలో కూడ మార్పు వచ్చింది. నేనేంటో చూపిస్తా.. జగన్ 2.నీ ను చూడబోతున్నారంటూ మాజీ సీఎం జగన్ సంచలన కామెంట్స్ చేశారు.ప్రజల కోసం పని చేస్తే ఎలా ఉంటుందో చూపించామని, ఇప్పుడు కార్యకర్తల కోసం పని చేస్తే ఎలా ఉంటుందో చూపిస్తానని అన్నారు వైసీపీ అధినేత జగన్ అన్నారు. బెజవాడ వైసీపీ కార్పోరేటర్లతో సమావేశమైన జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ఎన్నికల సందర్భంగా చెప్పినట్టుగానే పథకాలు అమలు చేయలేక చంద్రబాబు చేతులు ఎత్తేస్తున్నారని ఎద్దేవా చేశారు.లండన్ నుంచి వచ్చిన తర్వాత తొలిసారిగా తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో నేతలను ఉద్దేశించి జగన్ మాట్లాడారు. ఈ సమావేశంలోనే ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. కార్యకర్తల కోసం ఇకపై గట్టిగా పని చేస్తాను అని చెబుతూనే తప్పుడు కేసులు పెట్టిన వారిపై ప్రైవేటు కేసులు పెడతానంటూ వార్నింగ్ ఇచ్చారు. తాము అధికారంలో ఉన్నప్పుడు పాలనపై ఫోకస్ పెట్టి కార్యకర్తలను విస్మరించిన వాట వాస్తవమేనని ఇకపై అలా జరగదని హామీ ఇచ్చారు. ఇప్పుడు చంద్రబాబు పెట్టిన కష్టాలు, బాధలు చూస్తున్నామని కచ్చితంగా అన్నింటికీ బదులు తీర్చుకుంటామని అన్నారు. అధికార పార్టీ నాయకులు దొంగ కేసులు పెడుతున్నారని, బెదిరిస్తున్నారని అయినా ఎవరూ భయపడొద్దని భరోసా ఇచ్చారు. ఈసారి కచ్చితంగా అధికారంలోకి వస్తామని జగన్ ధీమా వ్యక్తం చేశారు. ఈసారి అధికారంలోకి వచ్చిన తర్వాత 30 ఏళ్లు పరిపాలిస్తామన్నారు. విలువలు విశ్వసనీయతతో రాజకీయాలు చేస్తున్నామని వాటిని ప్రజలు గుర్తిస్తున్నారని 9 నెలలు అయిన చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేదని గుర్తు చేశారు. ఇలా జరుగుతుందని ఎన్నికల ప్రచారంలోనే చెప్పానని గుర్తు చేసారు జగన్. ఇప్పుడు అన్నీ ప్రజలకు గుర్తుకు వస్తున్నాయని ఈసారి ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైసీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అభిప్రాయపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం ఏరులై పారుతోందని ఊరికో బెల్టుషాపు నడుస్తోందని వాటినే ఎమ్మెల్యేలు నడిపిస్తున్నారని ఆరోపించారు జగన్. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఏ పని కావాలన్నా ఎమ్మెల్యేల నుంచి చంద్రబాబు వరకు ముడుపు చెల్లించుకోవాల్సి ఉంటుందని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కష్టాలు ఉంటాయని కేసులు పెడతారని వాటిని చూసి భయపడిపోవద్దని అన్నారు జగన్. అలాగని వ్యక్తిత్వాన్ని కోల్పోవద్దని సూచించారు. అందుకు తానే ఉదాహరణ అని అన్నారు జగన్. టీడీపీ కాంగ్రెస్ కలిసి తనపై అక్రమ కేసులు పెట్టి 16 నెలలు జైల్లో కూడా ఉంచారని తర్వాత ఏం జరిగిందో అందరికి తెలుసని అన్నారు. ప్రజలు అండగా ఉన్నారని తెలిపారు. లోకల్ సంస్థల ఎన్నికల్లో ఎవరూ సాధించలేని విజయాలను వైసీపీ సొంతు చేసుకుందని వారిలో కొందర్ని కూటమి ప్రభుత్వం ప్రలోభాలు పెట్టి లాక్కుంటుందని అన్నారు జగన్. కొందరు మాత్రం వైసీపీకి మద్దతుగా నిలబడ్డారని గుర్తు చేశారు. అలా నిలబడిన వారిని చూసి గర్వపడుతున్నాను అన్నారు. ఇదంతా ప్రజల సహకారంతోనే సాధించామని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశారమన్నారు. ఎప్పుడు ఏ పథకం ఇస్తామో చెప్పి మరీ అమలు చేశామన్నారు. కరోనా లాంటి పరిస్థితుల్లో కూడా సాకులు చెప్పకుండా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామన్నారు జగన్. అందుకే వైసీపీ నేతలు, కార్యకర్తలు సగర్వంగా ప్రజల మధ్యకు వెళ్లగలుగుతున్నారని జగన్ అన్నారు. అన్ని కష్టాల్లో ప్రజలకు అండగా ఉండటంతో కాలర్ ఎగరేసుకొని తిరగుతున్నామని చెప్పుకొచ్చారు. గెలిచిన 9 నెలలే అవుతున్నా ప్రజల మధ్యకు వెళ్లలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలకు ఇవ్వాల్సిన పథకాలు గురించి అడుగుతున్నారని తెలిపారు. ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక పోలీసు రాజ్యం నడుపుతున్నారని ఆరోపించారు జగన్. చంద్రబాబు నైజం ప్రజలకు పూర్తిగా అర్థమవుతుందని అందుకే వచ్చే ఎన్నికల నాటికి ఊహించని మెజార్టీతో వైసీపీ అధికారంలోకి వస్తుందన్నారు. జమిలీ ఎన్నికలు అంటున్నారని ఎప్పుడు ఎన్నికలు వచ్చినా విశ్వసనీయతతో ప్రజల ముందుకు వెళ్దామన్నారు. ఈసారి జగనన్న 2.0 చూస్తారని అన్నారు. కార్యకర్తల కోసం జగన్ పని చేస్తే ఎలాఉంటుందో చూస్తారని అన్నారు. కార్యకర్తలు పడుతున్న ఇబ్బందులు చూసిన తర్వాత అండగా ఉండాలని నిర్ణయించుకున్నానని అన్నారు. తప్పుడు కేసులు పెట్టే వాళ్లపై ప్రైవేటు కేసులు పెడతామన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ప్రతినెలా సంక్షేమ పథకాలను అమలు చేశామని, సూపర్ సిక్స్ అంటూ ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. జనంలోకి కూటమి నేతలు వెళితే అసలు విషయం వారికి తెలుస్తుందని జగన్ అన్నారు. ఇలా విదేశీ పర్యటన ముగించుకున్న జగన్.. తొలిసారిగా విజయవాడ కార్పొరేటర్లతో, ముఖ్య నాయకులతో సమావేశమై చేసిన ప్రసంగం ఏపీలో పొలిటికల్ హాట్ టాపిక్ గా మారింది.

# ఎమ్మెల్యే వర్సెస్ ఎంపీ

కడప, ఫిబ్రవరి 6, కడప జిల్లాలో బీజేపీ ఉనికి నామమాత్రంగా ఉంటుంది. అయినా కూటమి లెక్కలు కలిసి వచ్చి ఆ జిల్లాకు చెందిన ఇద్దరు కీలక నేతలు బీజేపీ ప్రజాప్రతినిధులుగా గెలిచారు. సీనియర్లు అయిన ఆ ఎమ్మెల్యే, ఎంపీలు ఒకే అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన వారైనప్పటికీ వారి మధ్య సఖ్యత లేకుండా పోయింది.. నువ్వా నేనా అన్నట్లు కత్తులు దూసుకుంటూ ఆధిపత్యపోరు కొనసాగిస్తున్నారు. ఎక్కడో గెలిచిన ఎంపీ జిల్లాకు వచ్చి ఎమ్మెల్యే వర్గంపై పెత్తనం చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ఇంతకీ ఎవరా నాయకులు? ఆ నియోజకవర్గంలో అసలేం జరుగుతుంది? కమలం పార్టీలో అంతలావు కీచులాటలకు కారణమేంటి?కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలో పాలిటిక్స్ ఎప్పుడు హాట్ హాట్‌గానే ఉంటాయి. ఏదో ఒక సంచలనానికి కారణమవుతుంటాయి. ఇప్పుడు ఇక్కడ ఒకే పార్టీకి చెందిన ఇద్దరు నేతలు ఢీ అంటే ఢీ అంటుండటం నియోజకవర్గంలో కాక రేపుతోంది. జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే అయిన దేవగుడి ఆదినారాయణరెడ్డిది ఒకప్పుడు ఫ్యాక్షన్ బ్యాక్ గ్రౌండ్ ఉన్న ఫ్యామిలీ. ఉత్తరాంధ్రలోని అనకాపల్లి ఎంపీగా బీజేపీ నుంచి గెలిచిన సీఎం రమేష్ కాంట్రాక్టర్ అయిన బిగ్‌షాట్. ఇప్పుడు ఆదినారాయణ రెడ్డి, సీఎం రమేష్‌లు మధ్య విభేదాలు నియోజకవర్గ రాజకీయాల్లో హీట్ పెంచేస్తున్నాయి. ఈ ఇద్దరు కమలం పార్టీ నుండి తొలిసారి పోటీ చేసి గెలిచిన వారే. వారిద్దరి స్వగ్రామాలు జమ్మలమడుగు నియోజకవర్గంలోనే ఉండటం విశేషం.దేవగుడి ఆదినారాయణ రెడ్డి స్వగ్రామం జమ్మలమడుగు.. సీఎం రమేష్ నాయుడు స్వగ్రామం ఎర్రగుంట్ల దగ్గర పొట్లదుర్తి. పొత్తులో భాగంగా అనకాపల్లి ఎంపీ బీజేపీ టికెట్ దక్కించుకున్న సీఎం రమేష్ అనకాపల్లికి వెళ్లి తక్కువ కాలంలోనే అక్కడ చక్రం తిప్పి విజయం సాధించారు. అనకాపల్లి ఎంపీగా ఉన్న సీఎం రమేశ్ జమ్మలమడుగు నియోజకవర్గంలోని విషయాలపై ఫోకస్ పెట్టడం హాట్ టాపిక్ అయి కూర్చుంది. ఆయన దూకుడుతో సొంత పార్టీ ఎమ్మెల్యే అయిన ఆదినారాయణరెడ్డి అసంతృప్తిగా ఉన్నారట.ఈనెల 2న కడప జిల్లా కలెక్టర్, ఎస్పీలకు సీఎం రమేశ్ లేఖ రాయడం ఇద్దరి మధ్య పెద్ద రచ్చకు దారి తీసింది. జమ్మలమడుగు నియోజకవర్గంలో నకిలీ మద్యం, మట్కా జూదం విచ్చలవిడిగా పెరిగిపోతున్నాయని.. వాటిని నిలువరించాలంటూ జిల్లా అధికారులకు సీఎం రమేశ్ లేఖ రాశారు. నియోజకవర్గంలో యథేచ్ఛగా జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలతో అనేక మంది ఇబ్బందులు పడుతున్నారని వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. కాపురాల్లో చిచ్చుపెట్టే అలాంటి వాటిపైన వెంటనే యాక్షన్ తీసుకోవాని జిల్లా ఉన్నతాధికారులకు రాసిన లేఖలో పేర్కొన్నారు.ఎంపీ రాసిన లేఖపై వెంటనే స్పందించిన జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు జమ్మలమడుగులోని క్లబ్బుని మూసివేశారు. దాంతో ఎమ్మెల్యే కి ఎంపీ కి మధ్య గ్యాప్ మరింత పెరిగిపోయిందన్న ప్రచారం జరుగుతుంది. సీఎం రమేష్ అధికారులకు రాసిన లేఖలో ఎక్కడా ఎమ్మెల్యే పేరును ప్రస్తావించకపోయినా.. నియోజకవర్గంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని లేఖలో ప్రస్తావించడం ద్వారా సీఎం రమేశ్ ఉద్దేశం ఏంటో అర్థమవుతుందని ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి వర్గీయులు గుర్రుగా ఉన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి వర్గానికి చెందిన దేవగుడి నాగేశ్వర్ రెడ్డి ఆ దందాలు నడుపుతున్నారని సీఎం రమేష్ లేఖలో పేర్కొన్నారు. ఇక్కడ ట్విస్ట్ ఏటంటే దేవగుడి నాగేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి దగ్గర బంధువే. దాంతో ఎంపీ ఫిర్యాదుతో ఎమ్మెల్యే ఇరుకున పడ్డట్టైంది.నియోజకవర్గంలో కాంట్రాక్టర్ల విషయంలోను ఎంపీ, ఎమ్మెల్యేల మధ్య గ్యాప్ ఉందట. జమ్మలమడుగులో అదాని సంస్థ నిర్మిస్తున్న పవర్ ప్లాంట్ కూడా ఇద్దరి మధ్య విభేదాలకు మరింత కారణమైందట. అదానీ ప్లాంట్ పనులకు సీఎం రమేష్‌కు చెందిన సంస్థ సబ్ కాంట్రాక్టర్‌గా వ్యవహరిస్తుందంట. ఆ సంస్థ చేస్తున్న పనులకు ఎమ్మెల్యే వర్గం అడ్డం పడుతుందన్న ప్రచారం ఉంది. గతంలో ఆదానీ సంస్థ కార్యాలయంలో సిబ్బందిని ఎమ్మెల్యే వర్గీయులు బెదిరించడం హాట్ టాపిక్ మారింది. ఈ విషయంలో ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి సీఎం చంద్రబాబుకు వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది.ఆ క్రమంలో ఎంపీ సీఎం రమేష్ అధికారులకు లేఖ రాయడం? అధికారవర్గం వేగంగా చర్యలు తీసుకోవడం ఎమ్మెల్యే వర్గీయులకు మింగుడు పడటం లేదంట. పేకాట క్లబ్బులు మూయించడం ఎమ్మెల్యే మధ్య వార్ ఎటు నుంటి ఎటు దారి తీస్తుందో అన్న ఆందోళన నియోజకవర్గ వాసుల్లో కనిపిస్తుంది. కూటమి పెద్దలు తక్షణం జోక్యం చేసుకుని పరిస్థితులు సెట్‌రైట్ చేయకపోతే.. ఫ్యాక్షన్ ప్రభావం తగ్గుతున్న జమ్మలమడుగులో పరిస్థితులు చేతులు దాటిపోయే ప్రమాదం ఉందని స్థానికులు బెంబేలెత్తుతున్నారు.

# సౌమ్య..లోకల్...

విజయవాడ, ఫిబ్రవరి 6, కూటమి ప్రభుత్వంలో టీడీపీ ఎమ్మెల్యే పార్లమెంటు సభ్యుడి ఆదేశాలను ధిక్కరించారంటే అందుకు ఏదో పెద్ద కారణం ఉంటుంది. లేకుంటే ఎమ్మెల్యే వెనక బడా నేత ఎవరైనా ఉండి ఉంటారు. లేకుంటే ఒక ఎమ్మెల్యే అధిష్టానం ఆదేశాలను ధిక్కరించడం అనేది టీడీపీ చరిత్రలో జరగదు. పార్టీ అధినాయకత్వం నిర్ణయించిన వారిని కాదని తన వర్గానికే మున్సిపల్ ఛైర్మన్ పదవి ఇవ్వాలంటూ నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య భీష్మించుకు కూర్చున్నారు. అంతటితో ఆగలేదు. ఎంపీ నిర్ణయాన్ని తప్పుపడుతూ తాను స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దింపేందుకు సిద్ధమయ్యారు. ఇది ప్రస్తుతం టీడీపీలో హాట్ టాపిక్ గా మారింది. అయితే చివరికి పార్టీ నాయకత్వం నిర్ణయించిన అభ్యర్థి కృష్ణకుమారి గెలిచినట్లు ఆర్డీవో ప్రకటించారు. టీడీపీకి అనుకూలంగా పదహారు, వైసీపీకి మూడు ఓట్లు వచ్చాయి. కృష్ణకుమారి నందిగామ మున్సిపల్ ఛైర్మన్ గా ఎన్నికయ్యారు. ఎంపీ నిర్ణయానికి చెక్ పెట్టగలిగారు. నందిగామ మున్సిపాలిటీలో పదమూడు మంది టీడీపీ వార్డు సభ్యులున్నారు. ఒక జనసేన సభ్యులున్నారు. అయితే నిన్ననే నందిగామ మున్సిపల్ ఎన్నిక జరగాల్సి ఉండగా విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని చిన్ని ఒక పేరును ఛైర్మన్ పదవికి ప్రతిపాదించారు. దీనికి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాత్రం అంగీకరించలేదు. ఎంపీ కేశినేని చిన్న స్వర్ణలేత పేరును సిఫార్సు చేయగా, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాత్రం సత్యవతి పేరును ఖరారు చేశారు. దీంతో నిన్న జరగాల్సిన సమావేశం ఈ ఇద్దరి మధ్య ఏకాభిప్రాయం కుదరక పోవడంతో అధికారులు వాయిదా వేశారు. అధినాయకత్వం నచ్చ చెప్పినా తంగిరాల సౌమ్య ససేమిరా అనడంతో ఈరోజు ఆసక్తికరమైన విషయాలు చోటు చేసుకున్నాయి.. ఇదిలా ఉండగా ఈ ఇద్దరిని కాదని పార్టీ అధినాయకత్వం మరోపేరును సూచించింది. పార్టీ హైకమాండ్ కృష్ణకుమారి పేరును మున్సిపల్ ఛైర్మన్ పదవికి ఖరారు చేసింది. కృష్ణకుమారికే బీ ఫారం ఇచ్చేసింది. అయితే ఇందుకు కూడా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అంగీకరించలేదు. పదోవార్డు కౌన్సిలర్ స్వర్ణలతకు కాకుండా, ఇటు సత్యవతి కాకుండా కృష్ణకుమారికి పార్టీ హైకమాండ్ బీఫారం ఇవ్వడం పట్ల ఎమ్మెల్యే వర్గీయులు అభ్యంతరం చెబుతున్నారు.

# జనసేన ఓవర్ కాన్ఫిడెన్స్...

తిరుపతి, ఫిబ్రవరి 6, జనసేన నేత నాగబాబు ఇటీవల చిత్తూరు జిల్లాలో చేసిన వ్యాఖ్యలను ఉదహరిస్తూ గతంలో ఉన్న వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎవరైనా తమదే పదేళ్లు కాదు.. ముప్ఫయి ఏళ్లు పవర్ మనదేనని అనుకుంటారు. అలా అనుకోవడం వారి తప్పు కాదు. ఒక ఎన్నికల్లో గెలుపు చూసి మళ్లీ.. మళ్లీ గెలుపు తమదేనని భ్రమిస్తుంటారు. అది ఏ రాజకీయ పార్టీ నేతలకైనా ఉన్న ఒకే ఒక అవలక్షణం. కానీ ప్రజలు మార్పు కోరుకుంటే ఐదేళ్లు ముగిసిన తర్వాత తిరిగి ఓటమిని మూట కట్టుకోవడం సహజ పరిణామమే. ఎందుకంటే సహజంగా ప్రభుత్వంపై ఉండే వ్యతిరేకతతో పాటు అనేక అంశాలు గెలుపోటములపై ప్రభావం చూపుతాయి. విశ్వాసం ఉండవచ్చు కానీ అతి విశ్వాసం ఏ రాజకీయ పార్టీలో ఉండకూడదు. ప్రజల వద్ద ఒళ్లు దగ్గర పెట్టుకుని వ్యవహరించాలి. జాగ్రత్తగా మాట్లాడాలి. వారి మనోభావాలకు అనుగుణంగా వ్యవహరించాలి.కానీ ఐదేళ్లు తిరగకముందే పార్టీని 2019 ఎన్నికల్లో ప్రతిపక్షానికి పరిమితం చేశారు. ఇక 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన జగన్ కూడా అధికారంతో కొంత విర్రవీగారు. మరో ముప్ఫయి ఏళ్లు తనదేనని అధికారం అని జగన్ కలలు కన్నారు. కానీ మొన్నటి ఎన్నికల్లో ఏమైంది. బలమైన నేతలు కూడా ఓటమి పాలయ్యారు. సంక్షేమ పథకాలు పనిచేయలేదు. జనం అభివృద్ధివైపు చూశారు. టీడీపీ నుంచి అనేక మంది నేతలు బయటకు వెళ్లారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ వన్ సైడ్ విజయం సాధించింది. దీంతో ఇక తమకు తిరుగులేదని ఫ్యాన్ పార్టీ నేతలు విర్రవీగిన విషయాన్ని ఈ సందర్భంగా కొందరు గుర్తు చేస్తున్నారు. 2019 ఎన్నికల తర్వాత జనసేన నుంచి పేరున్న నేతలు పార్టీని వీడి వెళ్లారు. చివరకు పార్టీలో పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్ మాత్రమే మిగులుతారేమోనన్న భయం ఆ పార్టీ క్యాడర్ లో కలిగింది. కానీ అనూహ్యంగా 2014 ఎన్నికల్లో హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేట్ తో విజయం సాధించింది. ఇప్పుడు అదే పరిస్థితి వైసీపీకి వచ్చింది. వైసీపీ నుంచి అనేక మంది నేతలు వెళ్లిపోతున్నారు. జగన్ ను కాదని బయటకు వెళ్లి అధికార పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. కానీ ఈ పరిస్థితి ఎల్లకాలం ఉంటుందని అనుకోలేమని నాగబాబు తెలుసుకోవాల్సి ఉంటుందన్న కామెంట్స్ సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. కేవలం మూడు పార్టీలు కలసినంత మాత్రాన గెలుపు గ్యారంటీ అని చెప్పలేం. మరో వైపు ఎవరికీ భయపడమని చెప్పడం పై కూడా నెట్టింట సెటైర్లు వినిపిస్తున్నాయి. వైఎస్ కు భయపడే పెద్దన్నయ్య కాంగ్రెస్ లో ప్రజారాజ్యాన్నివిలీనం చేశారని, జగన్ కు భయపడే తమ్ముడు టీడీపీతో జత కట్టాడని, ఒంటరిగా పోటీ చేసి ధైర్యం నిరూపించుకోవాలని సవాళ్లు విసురుతున్నారు. ఎందుకంటే మొన్నటి ఎన్నికల్లో అధికారంలో లేరు కాబట్టి క్యాడర్ నుంచి లీడర్ల వరకూ అందరూ అధికారం తమకు వస్తే పదవులు వస్తాయని భ్రమించారు. తమ దశతిరుగుతుందని నమ్మారు. కానీ అందరికీ ఏ పార్టీ అవకాశం ఇవ్వలేదు. దీంతో అసంతృప్తి పెరుగుతుంది. 2024 ఎన్నికల తరహాలో మూడు పార్టీల క్యాడర్ కలసి పనిచేస్తుందన్న గ్యారంటీ లేదు. జగన్ పార్టీకి నలభై శాతం ఓట్లు వచ్చిన సంగతిని ఎవరూ విస్మరించకూడదు. ఒంటరిగా పోటీ చేసి ఆ స్థాయిలో ఓటింగ్ శాతం తెచ్చుకోవడం అంటే ఆషామాషీ కాదు. ఈ విషయం రాజకీయాలు తెలిసిన వారికి ఎవరైనా అర్థమవుతుంది.

# ఇక తెలుగులో జీవోలు

విజయవాడ, ఫిబ్రవరి 6, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రభుత్వ ఉత్తర్వులను (జీవోలు) ఇంగ్లీష్‌తో పాటు తెలుగులోనూ జారీ చేయాలని నిర్ణయించింది. సాధారణ పరిపాలన శాఖ అన్ని శాఖలకు ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. ముందుగా ఇంగ్లీష్‌లో ఉత్తర్వులు జారీ చేసి, వాటిని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని, అనంతరం రెండు రోజుల్లోగా అవే ఉత్తర్వులను తెలుగులోనూ జారీ చేయాలని సూచించింది. అనువాద ప్రక్రియ కోసం డైరెక్టర్ ఆఫ్ ట్రాన్స్‌లేషన్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.తెలుగు భాష ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని, 98% మంది తెలుగు మాట్లాడే రాష్ట్రంలో ప్రభుత్వ ఉత్తర్వులు సులభంగా అందుబాటులోకి రావాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌లో ఇది భాషా సమగ్రతకు తోడ్పడుతుందని ప్రభుత్వం పేర్కొంది. ఇటీవల విజయవాడలో నిర్వహించిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో కూడా పాలనా వ్యవహారాలు తెలుగులో జారీ చేయడం అవసరమని తీర్మానించారు. తాజాగా తీసుకున్న నిర్ణయం తెలుగు కవులు, రచయితల నుండి ప్రశంసలు పొందుతోంది. తాజాగా ఒక ఖైదీ పెరోల్‌కు సంబంధించిన ఉత్తర్వులను తెలుగులో విడుదల చేసింది ఏపీ హోం శాఖ.ఈ నిర్ణయాన్ని అమలు చేసే మొదటి చర్యగా, హోం శాఖ తాజాగా ఒక ఖైదీ పెరోల్‌కు సంబంధించిన ఉత్తర్వులను తెలుగులో విడుదల చేసింది. ఇది ప్రజలకు ప్రభుత్వ నిర్ణయాలను మరింత అవగాహన కలిగించే దిశగా తొలి అడుగు అని పేర్కొంది. ప్రభుత్వ జీవోలు తెలుగులో విడుదల కావడంతో, ప్రజలు వాటిని సులభంగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఈ విధంగా, ప్రభుత్వ ఉత్తర్వులను ఇంగ్లీష్‌తో పాటు తెలుగులోనూ జారీ చేయడం ద్వారా ప్రజలకు అవగాహన పెరగడమే కాకుండా, భాషా సమగ్రతకు కూడా తోడ్పడుతుందంటున్నారు భాషా అభిమానులు.

# వివేకా హత్య కేసులో కదలిక

కడప, ఫిబ్రవరి 6, మాజీ సీఎం వైఎస్ జగన్ బాబాయి వైఎస్ వివేకా హత్య కేసు కీలక మలుపు తిరిగింది. మాజీ ఎంపీ వివేకా హత్య కేసు రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. తాజాగా జరిగిన కీలక పరిణామంతో ఈ కేసు ప్రస్తుతం వార్తల్లో నిలిచింది. వివేకా హత్య కేసులో అప్రూవర్ గా మారిన దస్తగిరి ఫిర్యాదుతో ఏకంగా ముగ్గురు పోలీస్ అధికారులపై కేసు నమోదు కావడం విశేషం.వివేకా హత్య కేసులో దస్తగిరి అప్రూవర్ గా మారిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి దస్తగిరిని పోలీసులు కడప సెంట్రల్ జైలుకు 2023లో తరలించారు. ఆ సమయంలో సీబీఐ ఎస్పీ రామ్ సింగ్ కేసు దర్యాప్తు సాగించారు. అయితే దస్తగిరిని జైలులో ఇదే కేసు నిందితుడు దేవిరెడ్డి శంకర్ రెడ్డి కుమారుడు డాక్టర్ చైతన్య రెడ్డి కలిసి మభ్యపెట్టినట్లు దస్తగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను ఈ కేసుకు సంబంధించి అబద్ధాలు చెప్పాల్సి వచ్చిందని చెప్పాలని, రామ్ సింగ్ కు వ్యతిరేకంగా మాట్లాడాలని చైతన్య రెడ్డి రూ. 20 కోట్లు ఆఫర్ చేసినట్లు దస్తగిరి ఫిర్యాదు చేశారు. అలాగే తనను కొందరు పోలీస్ అధికారులు, నిందితులకు సపోర్ట్ చేయమని ఒత్తిడి తెచ్చినట్లు కూడ దస్తగిరి ఫిర్యాదు చేయడంతో సంచలనంగా మారింది.తాజాగా పోలీసులు వివేకా హత్య కేసుపై దృష్టి సారించిన నేపథ్యంలో, దస్తగిరి ఇచ్చిన ఫిర్యాదు తెరమీదికి వచ్చింది. దీనితో జమ్మలమడుగు డిఎస్పీగా గతంలో పనిచేసిన నాగరాజు, గతంలో ఎర్రగుంట్ల సీఐగా పనిచేసిన ఈశ్వరయ్య, కడప జైలు సూపర్డెంట్ ప్రకాష్ , డాక్టర్ చైతన్య రెడ్డిలపై పోలీసులు తాజాగా కేసు నమోదు చేశారు. పులివెందుల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దస్తగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏకంగా ముగ్గురు పోలీసు అధికారులపై కేసు నమోదు కావడం ఇప్పుడు సంచలనంగా మారింది.కాగా ఇటీవల వివేకా హత్య కేసు గురించి మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఢిల్లీలో కీలక వ్యాఖ్యలు చేశారు. వివేకా మరణించిన సమయంలో తాను అవినాష్ రెడ్డికి ఫోన్ చేశానని, అయితే అవినాష్ రెడ్డి ఫోన్ వేరొకరికి ఇవ్వగా.. గుండెపోటుతో మృతి చెందినట్లు తనకు ఫోన్ లో తెలిపారని సాయి రెడ్డి తెలిపారు. ఇలా సాయి రెడ్డి కామెంట్స్ చేసిన సమయంలో వివేకా హత్య కేసు వార్తల్లో నిలవగా.. తాజాగా దస్తగిరి ఫిర్యాదు తో మరో మారు ఈ కేసు హైలెట్ గా మారింది.

# పక్కా ప్లాన్ తో లోకేష్

విజయవాడ, ఫిబ్రవరి 6, మంగళగిరి ఎమ్మెల్యే. ప్రభుత్వంలో కీలక శాఖకు మంత్రి. అక్కడి వరకే పరిమితం కావడం లేదు మినిస్టర్ నారా లోకేశ్. అలా అని మిగతా మంత్రుల శాఖల్లో వేలు పెట్టడం లేదు. డామినేషన్ చూపించట్లేదు. హడావుడి, హంగామా అసలే లేదు. రెండ్రోజుల ఢిల్లీ పర్యటనలో వరుస పెట్టి కేంద్రమంత్రులను కలిసి రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిశారు.ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎడ్యుకేషన్ సెంటర్‌ను ఏపీలో ఏర్పాటు చేయాలని కోరారు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి.. డిఫెన్స్ పరికరాల తయారీ యూనిట్లు నవ్యాంధ్రకు వచ్చేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో భేటీ అయి విద్యారంగంలో రాష్ట్రానికి అవసరమైన సహకారం, న్యూ ఎడ్యుకేషన్ పాలసీపై డిస్కస్ చేశారు.నిధులు, పెట్టుబడుల కోసం ఏపీ ప్రభుత్వం తరఫున ప్రయత్నాలు చేస్తున్నారు లోకేశ్. బీజేపీ పెద్దలు, కేంద్ర మంత్రులు కూడా చంద్రబాబు వారసుడిగా, ఏపీ మంత్రిగా లోకేశ్ మంచి ప్రయారిటీ ఇస్తుండటం ఆసక్తికరంగా మారింది. ప్రధాని మోదీ విశాఖ పర్యటనలోనూ లోకేశ్‌తో సెపరేటుగా మాట్లాడారు.కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచిపోయినా ఇప్పటివరకు తనను ఎందుకు ప్రత్యేకంగా కలువలేదని అడిగారు. ఫ్యామిలీతో ఢిల్లీకి వచ్చి తనను కలవాలంటూ కూడా సూచించారు. ఇలా ప్రయారిటీ ఇస్తున్న నేపథ్యంలో లోకేశ్ ఢిల్లీ పర్యటన చర్చనీయాంశం అవుతోంది. అంతే కాదు హస్తిన టూర్‌లో లోకేశ్ ప్రశాంత్ కిశోర్‌తో భేటీ అయ్యారన్న టాక్ పొలిటికల్ డిస్కషన్ పాయింట్ అయింది.ఢిల్లీలోని సీఎం చంద్రబాబు అధికార నివాసంలో ప్రశాంత్ కిశోర్, లోకేశ్ భేటీ రెండు గంటల పాటు సాగిందని చెబుతున్నారు. ఏపీ రాజకీయాలపై చర్చించుకున్నారని అంటున్నారు. ఏపీలో ఎనిమిది నెలల కూటమి పాలనపై పబ్లిక్ టాక్ ఎలా ఉందో ఆరా తీశారట లోకేశ్. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తుండటంపైనా చర్చ జరిగిందట. ఏపీలో కూటమి ప్రభుత్వం జనంలోకి మరింతగా వెళ్లేందుకు తీసుకోవాల్సిన చర్యలపై లోకేశ్‌కు కొన్ని సూచనలు చేశారట పీకే. టీడీపీ తన అధికారాన్ని మళ్లీ నిలబెట్టుకోవాలన్నా వైసీపీ పుంజుకోకుండా ఎలాంటి స్ట్రాటజీపై పీకే సజెషన్స్ ఇచ్చారట. తన ఐడియాస్‌ను లోకేశ్‌తో షేర్ చేసుకున్నారట ప్రశాంత్ కిశోర్.లోకేశ్, పీకే భేటీలో తెలంగాణ పాలిటిక్స్ మీద కూడా డిస్కషన్ జరిగినట్లు టాక్.

## ఆటో కార్మికులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఏర్పాటు చేయాలి

**సిఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు పి.శ్రీనివాసులు**



కోట ఫిబ్రవరి 6 (శ్రీచక్ర) : ఆటో కార్మికులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పి.శ్రీనివాసులు అన్నారు.కోట మండలం కోట బస్ స్టాండ్ సెంటర్ నందు నూతనంగా 18 మందితో ఆటో స్టాండ్ ఏర్పాటు చేయడం జరిగింది.అధ్యక్ష ,కార్యదర్శులుగా పుట్టయ్య,గిరి ఉపాధ్యక్షులు మల్లికార్జున ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా గురువారం సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు పి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఆటో కార్మికులపై పోలీసులు వేధింపులు రోజురోజుకి ఎక్కువ అవుతున్నాయని ఫైనాన్స్ వేధింపులు కూడా రోజురోజుకీ పెరుగుతున్నాయి అలాగే ఆటో కార్మికులకు బ్యాంకులు ద్వారా రుణాలను ఏర్పాటు చేసి కార్మికులను ఆదుకోవాలి ఆటో కార్మికులకు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసి ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ప్రభుత్వమే బాధ్యత తీసుకొని నిర్వహించాలి అలాగే ఇటీవల కాలంలో హిట్,రన్ 106 (1) ,102 ( 2) కఠినమైన చట్టాలను తీసుకుని వచ్చి ఈ చట్టం ప్రకారం ప్రమాదాలు జరిగితే డ్రైవర్ల బాధ్యతలాగా చూపించడం మంచి పద్ధతి కాదని తెలియజేశారు.ఈ చట్టం ప్రకారం ప్రమాదం జరిగితే డ్రైవర్లు జీవితకాలం జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉందని వెంటనే చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఆర్టీవో ఆఫీస్ నుండి ఆటో కార్మికుల మిద ఫైన్లు చేయడం కూడా ఎక్కువ అవుతుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రమణయ్య,ఆటో కార్మిక కమిటీ సభ్యులు నాగరాజు,రమణయ్య,భాస్కర్, ఆనంద్,సుధాకర్,కోటయ్య ,నారయ్య,వినోద్,అశోక్,శ్రీనివాసులు, రాజా,గోవిందు, నాగరాజ,చెన్నయ్య లను ఎన్నుకోవడం జరిగింది.

## చిట్టేడు లో పూరి గుడిసె దగ్ధం

**బాధితుడు కుడుముల.చిన్న అంకయ్యకు ఆర్థిక సాయం చేస్తున్న యాకశిరి. చిన్నయ్య**





కోట ఫిబ్రవరి 6 (శ్రీచక్ర) : కోట మండలం చిట్టేడు గ్రామంలో గిరిజన కుటుంబానికి చెందిన కుడుముల.చిన్న అంకయ్య పూరి గుడిసె ప్రమాదవశాత్తు అగ్నికి పూర్తిగా దగ్ధమైంది.ఈ ఘటనలో ఇంటిలోని వంట సామాగ్రి టీవీ,విద్యుత్ నీటి మోటారు,వంట సామాగ్రి బట్టలు,తదితర సామాన్లు కాలిపోయాయి.సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలును అదుపు చేయడం జరిగింది.అప్పటికే ఇంటిలో ఉన్న సామాగ్రి మొత్తం కాలిపోవడం జరిగింది.విషయం తెలుసుకున్న కోట మండల ఎస్సీ సెల్ నాయకులు యాకసిరి.చిన్నయ్య ప్రస్తుత కుటుంబ జీవనం కోసం 25 కేజీల బియ్యం,2000 రూపాయలును ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు.

## ఆకస్మికంగా ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన సబ్ కలెక్టర్

**పనితీరు బాగుండడంతో డాక్టర్లు ను అభినందించిన గూడూరు సబ్ కలెక్టర్ రాఘువేంద్ర మీనన్**



కోటఫిబ్రవరి6(శ్రీచక్ర):కోటమండలంలోని స్థానిక ప్రభుత్వాసుపత్రి ని గూడూరు సబ్ కలెక్టర్ రాఘువేంద్ర మీనన్ గురువారం ఆకస్మికంగాతనిఖీ చేయడంజరిగింది.ఈసందర్భంగా ఆసుపత్రిలోనిపలురికార్డులను,రోగులగదులనుక్షుణ్ణంగా పరిశీలించి, అనంతరం వాష్ రూమ్ లను పరిశీలించిన తర్వాత ఆసుపత్రి సిబ్బందిని పిలిపించి వాష్ రూములను సక్రమంగా ఉంచుకోవాలని వారికి తెలిపారు.అదేవిధంగా ఆసుపత్రిలో డాక్టర్లు యొక్క పనితీరును ప్రత్యక్షంగా చూడడంతో పనితీరు బాగుందని డాక్టర్లును అభినందించారు.ఆసుపత్రికి వచ్చిన రోగులకు మంచి వైద్యాన్ని అందించడమే కాకుండా రోగులతో సన్నిహితంగా ఉండాలని డాక్టర్లుతో చెప్పారు.ఈ కార్యక్రమంలో స్థానిక డాక్టర్లు డోమ్ ప్రియా,తదితర డాక్టర్లు,ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

# 9న ఆత్మకూరుకు ఐదుగురు మంత్రులు రాక

**ఖరారైన మంత్రుల పర్యటనమంత్రి ఆనం ఆధ్వర్యంలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు హాజరుకానున్న మంత్రులు ఫరూక్, నారాయణ, సవిత, బిసి జనార్ధన్‌రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి**



ఆత్మకూరు. ఫిబ్రవరి 6 (శ్రీ చక్ర.).ఆత్మకూరు పట్టణంలో ఈనెల 9న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు ఐదుగురు మంత్రులు, పార్లమెంటు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ మేరకు మంత్రుల పర్యటన ఖరారైంది. రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫరూక్, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ, రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, రాష్ట్ర రహదారులు, భవనములశాఖ మంత్రి బిసి జనార్దన్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈనెల 9న ఆత్మకూరుకు విచ్చేయనున్నారు. 9వ తేదీ ఉదయం 9.30 గంటలకు ఆత్మకూరు టిడ్కో గృహ సముదాయంలో శ్రీ సీతారాములు స్వామివారి ఆలయానికి భూమిపూజ, ఉదయం 10.30 గంటలకు పంచాయతీరాజ్ అతిథిగృహ నిర్మాణానికి శంకుస్థాపన, 11 గంటలకు ఆర్‌అండ్‌బి అతిథిగృహం ప్రారంభోత్సవం, 11.30 గంటలకు నూతన బీసీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల ప్రారంభోత్సవం కార్యక్రమాల్లో మంత్రులు, ఎంపీ పాల్గొననున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆత్మకూరు బిసి ఆర్ఎస్ బాలికల పాఠశాలలో పాత్రికేయుల సమావేశం అనంతరం పాఠశాలల విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తారు. ఈ కార్యక్రమాలకు ఆయాశాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.

## విద్యార్థుల అభ్యసన యొక్క స్థితిగతులపై ఆరా మిడ్డే మీల్స్ నిర్వహణ ను పరిశీలించిన ఎమ్ఈఓ దారా.మస్తానయ్య





కోట ఫిబ్రవరి 6 (శ్రీచక్ర) : కోట మండలంలోని శ్రీ లక్ష్మమ్మ గిరిజన కాలనీ ఎంపీపీఎస్ పాఠశాలలో కోట మండల విద్యాశాఖ అధికారి ధారా మస్తానయ్య గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా పాఠశాలలోని పలు రికార్డులను, మిడ్ డే మీల్స్ నిర్వహణ, విద్యార్థుల యొక్క స్థితిగతులపై క్షుణ్ణంగా ఆరా తీశారు.అనంతరం పలువురు విద్యార్థులను పలు ప్రశ్నలు ద్వారా సమాదాన్ని రాబట్టారు.అంతేకాకుండా విద్యాభ్యాసం పై పిల్లలకు పలు మెలుకువలను తెలియజేశారు.ఎంఈఓ తో పాటు ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయురాలు,విద్యార్థులు ఉన్నారు.

## హెల్మెట్ ధరించడం వలన మనతో పాటు మరో ఇద్దరికి ప్రమాదం జరగకుండా నివారించవచ్చును

**హెల్మెట్ ధరించడం తలకు భారంగా భావించవద్దు, మన కుటుంబానికి భద్రత :జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి ... ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ఆవశ్యకతను వివరించి, ప్రతి ఒక్కరూ తప్పక హెల్మెట్ ధరించి ప్రయాణాలు చేయాలని జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి సంయుక్తంగా కోరారు**






భీమవరం ఫిబ్రవరి 6 (శ్రీ చక్ర ) గురువారం స్థానిక కొత్త బస్టాండు యస్ జెజియం ఉన్నత పాఠశాల వద్ద 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో జరిగిన హెల్మెట్ ర్యాలీని జిల్లా కలెక్టరు జెండా ఊపి ప్రారంభించి, హెల్మెట్లు ధరించి జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి ద్విచక్ర వాహనాలను స్వయంగా నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. జువ్వలపాలెం రోడ్డు శ్రీ అల్లూరి సీతారామరాజు స్మృతి వనం వరకు ర్యాలీ సాగింది. పట్టణంలో పలువురు రెండు చక్రాల వాహన దారులకు హెల్మెట్ ర్యాలీతో మంచి ఆలోచన, స్ఫూర్తిని కలిగించాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యానికి చేరాలని, ఇంటి దగ్గర మీకోసం తల్లితండ్రులు, భార్య, పిల్లలు ఎదురు చూస్తారని జిల్లా కలెక్టరు హితవు పలికారు. రెండు చక్రాల వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం వలన జరిగే మరణాలలో 70 శాతం కేసులు ఉంటున్నాయని అన్నారు. హెల్మెట్ ధరించడం తలకు భారంగా ఎంతమాత్రం భావించవద్దని, రోజూ






జరుగుతున్న ప్రమాదాలను ఒకసారి పరిశీలించి తప్పక హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. మన జిల్లాలో మోటారు సైకిల్ మీద ముగ్గురు ప్రయాణాలు చేస్తున్నారని, ఇది చాలా బాధాకరం అన్నారు. మోటారు వాహనం చట్టం 129 సెక్షన్ ప్రకారం రెండు చక్రాల వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతున్న వాహనచోధకుల వివరాలను తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతున్న వారిని మొదట హెచ్చరికతో వదిలి, హెల్మెట్ యొక్క ఆవశ్యకతను వివరించాలని, రెండవసారి కూడ హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తే ఖచ్చితంగా మోటారు వాహన చట్టం 177 సెక్షన్ ప్రకారం వెయ్యి రూపాయలకు పైగా అపరాధ రుసుం విధించబడుతుందని జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి హెచ్చరించారు.జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి మాట్లాడుతూ 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో జనవరి 16 వ తేదీ నుండి జిల్లాలో ప్రతి రోజూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించటం మంచి శుభ పరిణామం అన్నారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరిలో ఆలోచన కలగాలని, వాహనం కొనుగోలు చేసినప్పుడే హెల్మెట్ కూడా తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రెండు చక్రాలు వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ఇద్దరు తోనే ప్రయాణాలు చేయాలని, నాలుగు చక్రాల వాహనదారులు తప్పనిసరిగా సీట్లు బెల్టులు, మద్యం సేవించకుండా నడిపి, ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే మరణాల శాతం చాలావరకు తగ్గుముఖం పడతాయని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఏఎస్పి వి.భీమారావు, జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమామహేశ్వర రావు, డీఎస్పీ ఆర్.జి.జయసూర్య, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు కె.యస్.యన్.ప్రసాదు,సి.హెచ్.వి.రమణ, యం.రవికుమార్, యన్.యల్.యస్.లక్ష్మి,డి.సత్యనాణ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.ఇ.ఇ.దానం, విజ్ఞాన వేదిక కన్వీనరు చెరుకువాడ రంగసాయి, స్వచ్ఛంద సేవకులు అల్లు శ్రీనివాసు, ఆటో యూనియన్ ప్రెసిడెంటు ఇంటి సత్యనారాయణ, రవాణా శాఖ, పోలీసు, వివిధ శాఖల సిబ్బంది,పట్టణ విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నిషేధంపై ఎన్ఎస్ఎస్, ఎన్ సీసీ విభాగాలు ఉద్యమించాలి ..

**- నన్నయ యూనివర్సిటీ రిజిస్టర్ డా సుధాకర్**






భీమవరం ఫిబ్రవరి 6 (చక్ర ) ప్లాస్టిక్ నిషేధంపై ఎన్ఎస్ఎస్, ఎన్ సీసీ విభాగాలు ఉద్యమించాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్టర్ డా సుధాకర్ పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాస్టిక్ నిషేధంపై కృషి చేస్తున్నారని, మన యూనివర్సిటీ పరిదిలో ప్రిన్సిపాల్స్, ఎన్ఎస్ఎస్, ఎన్ సీసీ విభాగాలు ప్రచార ర్యాలీలు, సదస్సులు నిర్వహించాలని, క్యాన్సర్ లాంటి వ్యాధులు ప్లాస్టిక్ వల్ల వస్తున్నాయని, ప్రభుత్వ శాఖలన్నీ చట్ట పరమైన చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నాయని అన్నారు. సామాజిక బాధ్యతగా తీసుకుని యువత ప్రజల్లో ప్లాస్టిక్ రహిత చైతన్యం కలిగించాలని అన్నారు. ఈ విషయంలో సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి విశేషంగా కృషి చేస్తున్నారని రిజిస్టర్ డా సుధాకర్ అన్నారు. ముందుగా రిజిస్ట్రర్ ను కలిసి యూనివర్సిటీ పరిధిలోని ఎన్ఎస్ఎస్, ఎన్ సీసీ విభాగాలు ప్లాస్టిక్ రహిత అవగాహన కార్యక్రమాలకు సహకరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. రంగసాయి మాట్లాడుతూ అన్ని కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్ సీసీ విభాగాలను కలుపుకుని ప్లాస్టిక్ రహిత అవగాహన కార్యక్రమాలను చేపడతామని అన్నారు. అనంతరం పోస్టర్ లను ఆవిష్కరించారు. ఎన్ఎస్ఎస్ హెడ్ నిట్టల కిరణ్ చంద్ర, గోపిశెట్టి మురళీ కృష్ణ లు పాల్గొన్నారు

## డిప్యూటీ సీఎం పవన్ ఆరోగ్యంగా ఉండాలని గో పూజ



భీమవరం ఫిబ్రవరి 6( శ్రీచక్ర )జ్వరంతో బాధపడుతున్న ఆంధ్రపదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని గో పూజ నిర్వహించారు.గురువారంభీమవరంగునుపూడి లోని విద్యా గణపతి ఆలయం వద్ద జనసేన నాయకులు పురోహితులు వేలూరి బుజ్జి ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ,అభిషేకాలు, గో పూజ కార్యక్రమాలను పురోహితులతో నిర్వహించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆరోగ్యంగా ఉండాలని, త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నామని అన్నారు. కార్యక్రమంలో మైలవరపు మణికంఠ, బ్రహ్మాజ్యోసుల ప్రసాద్, చెరుకుపల్లి సంతోష్, బొల్లప్రగడ శేషు, నందిగామ వీరభద్రస్వామి, పెద్దడ సాయి కిరణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## పేద మహిళ జీవనోపాధికి కుట్టు మిషన్లు పంపిణీ




భీమవరం ఫిబ్రవరి 6( శ్రీ చక్ర )మానవతా సంస్థ, భీమవరం శాఖ ఆధ్వర్యంలో పేద మహిళ జీవనోపాధికి కుట్టు మిషన్, నాలుగు కుటుంబాల వారికి నిత్యవసరాలు అందించే కార్యక్రమం భీమవరం టూ టౌన్ లోని ఆదర్శనగర్ రామాలయం వద్ద నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు పెన్మెత్స రామ్మోహన్ వర్మ (పూనారామం), చైర్మన్ బుద్ధరాజు వెంకటపతిరాజులు మాట్లాడుతూ ప్రతి నెల సేవ కార్యక్రమంలో భాగంగా నిరుపేద కుటుంబాలకు సంస్థ సభ్యుల సహకారంతో నిత్యవసరాలు అందిస్తున్నామని తెలిపారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల ఉండుర్రు గ్రామానికి చెందిన తీపర్తి నాగమణి అనే వితంతువుకు ఉపాధి నిమిత్తం కుట్టుమిషన్ , నలుగురు పేద కుటుంబాల వారికి నిత్యవసర సరుకులు మా సంస్థ సభ్యులు దాట్ల కృష్ణంరాజు, ఝాన్సీ లక్ష్మి దంపతుల కుమారుడు దాట్ల సురేష్ కుమార్ (అమెరికా)పుట్టినరోజు సందర్భంగా వారి సౌజన్యంతో అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ కో. చైర్మన్ కారుమూరి నరసింహమూర్తి (బాబు), దండు రంగరాజు, పెన్మెత్స వెంకట సోమరాజు, బ్యాంక్ సుబ్బరాజు, కోపెల్ల సూరి, మంతెన కృష్ణంరాజు, మిలట్రీ కృష్ణంరాజు, చింతలపాటి రామరాజు, దండు సూర్యనారాయణ రాజు లు పాల్గొన్నారు.

## సిసి కెమెరాల పై వ్యాపారస్తులకు అవగాహన

### సీఐ రామయ్య నాయుడు



కర్నూలు, ఫిబ్రవరి 6 ( శ్రీచక్ర): జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు గురువారం కర్నూల్ వన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి క్లాత్ అసోసియేషన్ మెంబర్స్ కి, బట్టల షాపుల యొక్క యజమానులను కర్నూలు ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్ లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐ రామయ్య నాయుడు మాట్లాడుతూ ఏలాంటి నేరాలు జరగకుండా ఉండేందుకు గాను సిసి కె?మెరాల ఏర్పాటు ఎంతగానో దోహదపడుతుందని, నేర నియంత్రణకు సిసి కెమెరాలు కీలకంగా పని చేస్తాయన్నారు. షాప్ ల ముందు స్వచ్ఛంధంగా సీసీ కెమెరాలు అమార్చుకోవాలని , అందరూ సహాయ సహాకారాలు అందిచాల్సిన భాధ్యత ఎంతగానో ఉందని షాపుల యాజమానులకు కర్నూల్ వన్ టౌన్ సిఐ తెలిపారు.

## నూతన కమాండెంట్‌ను కలిసిన నగరపాలక కమిషనర్



కర్నూలు, ఫిబ్రవరి 6 (శ్రీచక్ర): ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ కర్నూలు రెండోవ బెటాలియన్ కమాండెంట్‌గా బాధ్యత చేపట్టిన ఎం.దీపిక పాటిల్‌ను నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు మర్యాదపూర్వకంగా కలిశారు.పటాలం పరిపాలన విభాగ కార్యాలయంలో కమాండెంట్‌ను కమిషనర్ కలిసి, పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

### ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నందు గల దిశ ఒన్ స్టాప్ కేంద్రం, మహిళాప్రాంగణం (శక్తి సదన్)ను పరిశీలించిన న్యాయమూర్తి



కర్నూలు, ఫిబ్రవరి 6 (శ్రీచక్ర): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి గురువారం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లోని దిశ ఒన్ స్టాప్ కేంద్రం, మహిళాప్రాంగణం (శక్తి సదన్) ను తనిఖీ చేశారు. కార్యాలయాలకు సంబందించిన రిజిస్టర్ లను పరిశీలించి రిజిస్టర్ ల ను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ సదస్సులో అక్కడ ఉన్న వారికి లీగల్ సర్వీసెస్ ఆక్ట్ 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయంను పొందుటకు అర్హులని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ. సి.డి. ఓ. అధికారి జోష్ణ సంబందిత అధికారులు, తదితరులు పాల్గొనారు.

## జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రంను సందర్శించిన న్యాయమూర్తి



కర్నూలు, ఫిబ్రవరి 6 (శ్రీచక్ర): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు గురువారం కర్నూలు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ నందు గల జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం ను కర్నూలు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి మరియు డి.ఎం.ఁ హెచ్.ఓ., శాంతికళ సందర్శిచారు. అక్కడ ఉన్న డాక్టర్ సైలేశ్ కుమార్, మేనేజర్ షేక్ ఇర్ఫాన్ లు జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం లో 0 నుంచి 18 వయస్సు గల పిల్లలకు అందించే వైద్య సదుపాయాల గురించి వివరించారు. ఈ కేంద్రం నందు పుట్టుకతో లోపం గల చిన్నారులకు చెవి, కంటి, విటమిన్, మానసిక లోపం గల పిల్లలకు శిక్షణ పొందిన వైద్యుల చే ఉచిత వైద్యం అందిస్తున్నామని తెలిపారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు లీగల్ సర్వీసెస్ వారు ఇంటింటి సర్వే నిర్వహించడానికి న్యాయవాదులు, పారా లీగల్ వలుంటీర్లు, ఆశ వర్కర్ ర్లు , ఎ.ఎన్.ఏం.,లు, కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్లచే టీమ్లను ఏర్పాటుచేసి కర్నూలు మరియు నంద్యాల జిల్లాల లో సోమవారం అనగా ఫిబ్రవరి 10 నుండి 24 తేదీ వరకు విభిన్న సామర్థ్యం గల పిల్లలు మరియు చిన్న వయస్సులోనే ఆరోగ్య లోపాలు గల పిల్లలను గుర్తించి వారికి బాలల సత్వర చికిత్స కేంద్రం ద్వారా చికిత్సలు చేపించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది కరుణ జ్యోతి, ప్యారా లీగల్ వాలంటీర్స్ డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు, సుధ,హేమంత్,చైల్డ్ వెల్ఫేర్ ఆఫీస్ అధికారులు జోష్ణ,లక్ష్మి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకూడదు

**నరసాపురం గోదావరి రేవు వద్ద భద్రతా కట్టు దిట్టం – సీసీ కెమెరాలు ఏర్పాటు, బస్టాండ్, రైల్వే స్టేషన్లో ప్రత్యేక నిఘా –జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ,**



నరసాపురం గోదావరి రేవు వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ.

నరసాపురం/ భీమవరం ఫిబ్రవరి 6 ( శ్రీ చక్ర)అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని నరసాపురం గోదావరి రేవు వద్ద భద్రతా ఏర్పాట్లను గురువారం జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి , పరిశీలించారు.గోదావరి రేవు వద్ద నుండి పంటి ద్వారా అధిక సంఖ్యలో భక్తులు రేపు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణానికి హాజరగు నేపథ్యంలో స్థానిక పోలీసు అధికారులకు మరియు సిబ్బందికి పలు సూచనలు చేయడం జరిగింది. నరసాపురం లోని స్థానిక గోదావరి రేవును సందర్శించి, తదుపరి స్థానిక పోలీస్ అధికారులతో సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం నరసాపురం టౌన్ లోని పలు ముఖ్యమైన కూడళ్లలో ఏర్పాటు చేసిన 20 సీసీ కెమెరాలను జిల్లా ఎస్పీ ప్రారంభించారు. ఈ సీసీ కెమెరాలను స్టేషన్ నందు గల కంట్రోల్ రూమ్కు అనుసంధానం చేయడం ద్వారా స్టేషన్ నుండే సిబ్బంది సంబంధిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా వుంచి, అసాంఘిక కార్యక్రమాలను అడ్డుకోవడం జరుగుతుందని





తెలియజేశారు.అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణానికి వెళ్లే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బందోబస్తు అధికారులకు పలు సూచనలు చేశారు. బాడీ వోర్న్ కెమెరాలు, డ్రోన్ కెమెరాలు, సోలార్ కెమెరాలు వంటి సాంకేతిక పరికరాలను ఉపయోగిస్తూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.రేపు స్వామివారి కళ్యాణాన్ని పురస్కరించుకుని అధిక మొత్తంలో భక్తులు నరసాపురం గోదావరి రేవు నుండి పంటి ద్వారా ప్రయాణించే అవకాశం ఉంది కావున పంటి నందు లైఫ్ జాకెట్స్, ఈతగాళ్లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. సామర్థ్యానికి మించి ప్రయాణికులు పంటి మీదకు రాకుండా రేవు వద్ద ప్రవేశ మరియు నిష్క్రమణ ద్వారాలు ఏర్పాటు చేసి పరిమిత సంఖ్యలో భక్తులను అనుమతించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. బాణాసంచా మరియు ఇతర పేలుడు స్వభావం గల పదార్థాలు గాని, వస్తువులు గాని పంటినందు తీసుకెళ్లకుండా ప్రతి ఒక్కరిని నిశితంగా తనిఖీ చేసిన తర్వాత మాత్రమే పంటిలోనికి అనుమతించాలని తెలియజేశారు. బస్సు మరియు ట్రైన్ మార్గాల ద్వారా అధిక సంఖ్యలో భక్తులు విచ్చేయుటకు అవకాశం ఉన్నది కావున బస్ స్టేషన్ మరియు రైల్వే స్టేషన్ నందు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దొంగతనాలు జరిగే ఆస్కారం ఎక్కువగా ఉంది కావున రైల్వే స్టేషన్ మరియు బస్ స్టేషన్ నుండి గోదావరి రేవుకు వచ్చే మార్గంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం మరియు నిరంతరం డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి. భీమారావు , నరసాపురం డిఎస్పీ జి.శ్రీ వేద , నరసాపురం టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. యాదగిరి నరసాపురం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.దుర్గాప్రసాద్ జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ వి.పుల్లారావు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించడంపై అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన ..... జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

**ద్విచక్ర వాహనం నడిపే ప్రతిఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి హెల్మెట్ ధరించడం పై ప్రజలకు అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమం ప్రణాళికా బద్దంగా రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు, ట్రాఫిక్ క్రమబద్దీకరణకు చర్యలు తీసుకుంటాం**

**రహదారి భద్రత మనందరి భాధ్యత జిల్లా ప్రజలు, మీడియా సహకరించాలి**





కర్నూలు, ఫిబ్రవరి 6 (శ్రీచక్ర): జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు 2025లో భాగంగా గురువారం హెల్మెట్ ధరించడంపై జిల్లా కేంద్రంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. హెల్మెట్ పై ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గురువారం హెల్మెట్ అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. హెల్మెట్ ధరించి అవగాహన బైక్ ర్యాలీ లో పాల్గొన్నారు. ఈ అవగాహన ర్యాలీ జిల్లా పోలీసు కార్యాలయం నుండి ప్రారంభమై కంట్రోల్ రూమ్, కిడ్స్ వరల్డ్, రాజ్ విహార్,కలెక్టరేట్ మీదుగా సి. క్యాంపు సెంటర్ వరకు కొనసాగింది. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ భాషా మాట్లాడుతూ జాతీయ రహదారి భద్రత వారోత్సవాలలో భాగంగా రోడ్డు భద్రత పై ప్రజలలో అవగాహన కల్పించేందుకే ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి పౌరుడు తన భద్రతకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నరు. క్షేమంగా వెళుతున్నా అవతలి వ్యక్తులు ర్యాష్ డ్రైవింగ్, మద్యం సేవించి బైక్ లు నడిపి ఇతరులను రోడ్డు ప్రమాదాలకు గురి చేస్తున్నారన్నారు. ఈ ప్రమాదాలలో హెల్మెట్ ధరించకపోవడం వలనే తలకు ఎక్కువగా గాయాలు అయి రోడ్డు ప్రమాదాలలో చనిపోతున్నారన్నారు. అందరూ ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నారన్నారు. నేషనల్ హైవే అథారిటి, ఆర్ ఁ బి శాఖలతో అవసరమైన చోట్ల సైన్ బోర్డులు, స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. 6 నెలలలో ప్రణాళిక బద్దంగా ట్రాఫిక్ ను క్రమబద్దీకరిస్తామన్నారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూజనవరి 16 నుండి ఫిబ్రవరి 15 వరకు జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ భాద్యతగా హెల్మెట్ ధరించాలన్నారు. తలకు హెల్మెట్ ధరించడం వలన 90 శాతం రోడ్డు ప్రమాదాలు తగ్గించవచ్చన్నారు. తలకు హెల్మెట్ ధరించకపోవడం వలనే ఎక్కువ శాతం తలకు గాయాలయై రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్నారన్నారు. ప్రతి ఒక్క ద్వి చక్రవాహనదారుడు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని ఇటీవలే హై కోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. కర్నూలు పట్టణంలో ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపేవిధంగా గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. తలకు హెల్మెట్ ధరించి ప్రతి ఒక్కరూ వాహనాలు నడిపేవిధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రహదారి భద్రత మనందరి భాధ్యత, జిల్లా ప్రజలు, మీడియా సహకరించాలన్నారు. నో పార్కింగ్ ప్రదేశాలలో వాహనచోదకులు వాహనాలు నిలపకూడదన్నారు. గత సంవత్సరాలలో కంటే ఈ 2025 సంవత్సరంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అన్ని శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటామన్నారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపడతామన్నారు. మరిన్ని బ్లాక్ స్పాట్స్ గుర్తించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ అవగాహన ర్యాలీ కార్యక్రమంలో డిప్యూటి ట్రాన్స్ పోర్ట్ కమిషనల్ శాంతకుమారి, సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ఆర్డీఓ సందీప్ కుమార్, అడిషనల్ కమాండెంట్ నాగేంద్రరావు, అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్ , డిఎస్పీలు, సిఐలు , ఆర్ ఐలు, ఆర్ టి ఓ అధికారులు ఎస్సైలు, ఆర్ ఎస్సై లు, ట్రాఫిక్ పోలీసులు, సివిల్ , ఎఆర్ , ఎపిఎస్పీ ఎస్ డి ఆర్ ఎఫ్ సిబ్బంది, ఆయా షోరూం ల సిబ్బంది, డ్రైవింగ్ స్కూళ్ళ వారు సుమారు 700 మంది హెల్మెట్ ర్యాలీ పాల్గొన్నారు.

## వైభవంగా మధ్వనవమి వేడుకలు -స్వర్ణరథం శ్రీ మధ్వాధీశులు







మంత్రాలయం, ఫిబ్రవరి 6,(శ్రీచక్ర) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో మధ్వ నవమి వేడుకలు వైభవంగా జరిగాయి. గురువారం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో, మధ్వ నవమి వేడుకలు పురస్కరించుకుని, శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్నికి విశేష క్షీరాభి శేకం, ఫల పుష్పాభి శేకం నిర్వహించారు. అనంతరం మధ్వాధీశుల చిత్ర పటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి ఇచ్చారు . శ్రీ మూల రామ దేవతలకు ప్రత్యేక విశేష అభిషేకాలు చేసి దూప దీప నైవేద్యాలు సమర్పించారు. శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్నికి స్వర్ణ కవచాలు, విశేష పుష్పాలంకరణ చేశారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా గ్రామ దేవత శ్రీ మంచాలమ్మను దర్శించుకుని, శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.అనంతరం మఠం ప్రాకారంలో స్వర్ణ రథంపై శ్రీ మధ్వాచార్యుల చిత్రపటాన్ని ఉంచి అశేష భక్తుల హర్షధ్వనుల మధ్య, మహిళా భక్తుల కోలాటాలు, భజనమండలి సభ్యుల కీర్తనలు, మేళతాళాలతో అంగరంగ వైభవంగా ఊరేగించారు. అనంతరం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థులు భక్తులకు ఫల మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. మధ్వనవమి సందర్భంగా, తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని రథోత్సవంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత పండిత కేసరి డాక్టర్ రాజా యస్ గిరియాచార్యులు , మేనేజర్ వెంకటేష్ జోషి , సహాయ మేనేజర్ ఐపి నరసింహ మూర్తి , పిఆర్వో వ్యాసరాజాచార్ , బిందుమాధవచార్, కుర్డీ జయతీర్థాచార్ , మఠం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## దేవమ్మ మారెమ్మవ్వలను దర్శించుకున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి



మంత్రాలయం, ఫిబ్రవరి 6,(శ్రీచక్ర) :మంత్రాలయం మండల పరిధిలోని సూగురు గ్రామంలో వెలసిన దేవమ్మ , మారెమ్మ అమ్మవారిని టీడీపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి , మంత్రాలయం నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు అమర్నథ్ రెడ్డి, రైతు జిల్లా కార్యదర్శి ఎల్లారెడ్డి లు గురువారం దర్శించుకున్నారు. ముందుగా గ్రామానికి చేరుకున్న ఆయనకు టీడీపీ నాయకులు భాస్కర్ రెడ్డి , మాజీ సర్పంచ్ ఈరన్నలు స్వాగతం పలికారు. దేవమ్మ మారెమ్మవ్వ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మంగళహారతి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.అనంతరం నాయకులు ఆయనకు శాలువా పూలమాలలు వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు హండే హనుమంతు , మీడియా కోఆర్డినేటర్ విజయరామిరెడ్డి , తిక్కస్వామి గౌడ్, నర్సారెడ్డి ,నారాయణ, నాగరాజు, హనుమంతు, గ్రామ నాయకులు , సుజ్ఞాన్నాం,దుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్ న్యూస్

# ఛాంపియన్స్ ట్రోఫీకు ముందు బిగ్ షాక్.. బాంబ్ పేల్చిన స్టార్ ప్లేయర్



ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025కు ముందు ఆస్ట్రేలియాకు మరో భారీ ఎదురు దెబ్బ తగిలింది.ఆస్ట్రేలియన్ స్టార్ ఆల్ రౌండర్ మార్కస్ స్టోయినిస్ షాకింగ్ డెసిషన్ తీసుకున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు వన్డేలకు గుడ్ బై చెప్పాడు. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం 15 మందితో కూడిన జాబితాలో చోటు దక్కించుకున్న అతడు.. ఇప్పుడీ ఈ అనూహ్య నిర్ణయం తీసుకోవం చర్చనీయాంశంగా మారింది. టీ20 క్రికెట్ పై దృష్టి సారించాలనే ఉద్దేశంతోనే ఈ మార్కస్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు క్రికెట్ వర్గాలు అంటున్నాయి."దేశం తరపున అత్యున్నత స్థాయిలో ప్రాతినిథ్యం వహించడం ఎప్పుడు గొప్పగానే ఉంటుంది. ఇంత అంత ఈజీ డెసిషన్ కాదు. కానీ నేను ఇప్పుడు సరైన సమయంలోనే ఆటకు వీడ్కోలు పలికాను. నా కెరీర్ లోని నెక్ట్స్ చాప్టర్ పై ఇక దృష్టి సారిస్తాను. కోచ్ ఆండ్యూ మెక్ డొనాల్డ్ తో నాకు మంచి అనుబంధం ఏర్పడింది. అతడు నన్ను ఎంతగానో సపోర్ట్ చేశారు." అని మార్కస్ పేర్కొన్నాడు.35 ఏళ్ల మార్కస్ స్టొయినిస్.. కెరీర్ లో 71 వన్డేలు ఆడి 1,495 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీతో పాటు 6 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 48 వికెట్లు పడగొట్టాడు. ఆస్ట్రేలియా తరపున స్టోయినిస్ తన చివరి వన్డే మ్యాచ్ ను పాకిస్థాన్ పై ఆడాడు. ఆ మ్యాచ్ లో 8 పరుగులు చేశాడు. తన బౌలింగ్ లో 11 పరుగులు ఇచ్చాడు.కాగా ఛాంపియన్స్ ట్రోఫీ కోసం ప్రకటించిన జట్టు నుంచి ఇప్పటికే కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్, మిచెల్ మార్ష్, జోష్ హెజిల్ వుడ్ ఆడటం అనుమానంగా మారింది. ఈ క్రమంలోనే ఇప్పుడు మార్క్ స్టోయినిస్ రిటైర్మెంట్ నిర్ణయం ప్రకటించి బాంబు పేల్చాడు.

# యశస్వి స్టన్నింగ్ క్యాచ్.. అయ్యర్ అదిరిపోయే రనౌట్! పోలా అదిరిపోలా!

ఇంగ్లండ్‌తో తొలి వన్డేలో భారత ఆటగాళ్లు కళ్లు చెదిరే ఫీల్డింగ్ విన్యాసాలతో ఆకట్టుకున్నారు. విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగుతున్న ఇంగ్లండ్ ఓపెనర్లు ఫిల్ సాల్ట్(26 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 43), బెన్ డక్కెట్(29 బంతుల్లో 6 ఫోర్లతో 32)లను శ్రేయస్ అయ్యర్, యశస్వి జైస్వాల్ సంచలన ఫీల్డింగ్‌తో పెవిలియన్ చేర్చారు. ఎడాపెడా బౌండరీలు బాదుతూ.. భారత బౌలర్లపై విరుచుకుపడిన ఈ ఇద్దర్నీ కళ్లు చెదిరే క్యాచ్‌తో పాటు అదిరిపోయే రనౌట్‌తో పెవిలియన్ చేర్చారు.యశస్వి, అయ్యర్ స్టన్నింగ్ ఫీల్డింగ్‌తో 2 పరుగుల వ్యధిలోనే ఈ ఇద్దరూ పెవిలియన్ చేరడంతో తొలి వికెట్‌కు నమోదైన 75 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ముందుగా అయ్యర్ అసాధారణ త్రో సాయంతో డేంజరస్ ఫిల్ సాల్ట్‌ను రనౌట్‌గా పెవిలియన్ చేర్చగా.. ఆ వెంటనే బెన్ డెక్కెట్‌ను సంచలన క్యాచ్‌తో యశస్వి జైస్వాల్ వెనక్కిపంపాడు.ఎఔఆ లబ ఇఔఉ: అందుకే విరాట్ కోహ్లీ ఆడటం లేదు: రోహిత్ శర్మ"ఎఔఆ లబ ఇఔఉ: అందుకే విరాట్ కోహ్లీ ఆడటం లేదు: రోహిత్ శర్మ"హార్దిక్ పాండ్యా వేసిన 9వ ఓవర్ ఐదో బంతిని ఫిల్ సాల్ట్ బ్యాక్‌వార్డ్ పాయింట్ దిశగా గ్యాప్‌లో కట్ షాట్ ఆడాడు. బౌండరీ దిశగా వెళ్లిన బంతిని శ్రేయస్ అయ్యర్ 30 మీటర్లు వేగంగా పరుగెత్తి స్లైడ్ చేస్తూ ఆపాడు. వెంటనే బంతిని వేగవంతమైన త్రోతో వికెట్ కీపర్ కేఎల్ రాహుల్‌కు అందించాడు. అప్పటికే రెండో పరుగు పూర్తి చేసుకున్న ఫిలిప్ సాల్ట్.. మూడో పరుగు కోసం పరుగెత్తాడు. హాఫ్ క్రీజు ధాటిన తర్వాత బెన్ డక్కెట్ పరుగుకు నిరాకరించడంతో యూటర్న్ తీసుకున్నాడు. కానీ అప్పటికే బంతిని అందుకున్న రాహుల్ స్టంప్స్‌కు కొట్టేయడంతో రనౌట్‌గా వెనుదిరిగాడు. దూకుడుగా ఆడిన ఫిలిప్ సాల్ట్ దురదృష్టవశాత్తు రనౌట్‌గా వెనుదిరిగాడు.హర్షిత్ రాణా వేసిన ఆ మరుసటి ఓవర్‌లోనూ బెన్ డకెట్ క్యాచ్ ఔటయ్యాడు. ఈ ఓవర్ మూడో బంతిని రాణా.. షార్ట్ లెంగ్త్‌లో వేయగా.. డకెట్ భారీ షాట్ ఆడే ప్రయత్నం చేశాడు. కానీ బ్యాట్ ఎడ్జ్ తీసుకున్న బంతి గాల్లోకి లేవగా.. మిడ్ వికెట్‌లో ఫీల్డింగ్ చేస్తున్న యశస్వి జైస్వాల్ వెనక్కి పరుగెత్తి అద్భుతంగా బంతిని అందుకున్నాడు. దాంతో బెన్ డకెట్ నిరాశగా పెవిలియన్ చేరాడు. ఇదే ఓవర్ చివరి బంతికి హ్యారీస్ బ్రూక్(0)ను రాణా కీపర్ క్యాచ్‌గా ఔట్ చేశాడు. దాంతో ఇంగ్లండ్ 77 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. ప్రస్తుతం శ్రేయస్ అయ్యర్, యశస్వి జైస్వాల్ ఫీల్డింగ్‌కు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.



# కెప్టెన్ ఇన్నింగ్స్ తో కావ్య పాప టీమ్ ధనాధన్!!

సౌతాఫ్రికా టీ20 లీగ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ మరోసారి తన దూకుడు ప్రదర్శనతో ఆకట్టుకుంది. టైటిల్ సాధించడమే లక్ష్యంగా తాజా సీజన్ లో దూసుకెళ్తోన్న ఆ జట్టు.. తాజాగా జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్ లో విజయం సాధించి క్వాలిఫయర్-2లోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ ఎలిమినేటర్ మ్యాచ్‌లో జొబర్గ్ సూపర్ కింగ్స్‌ను 32 పరుగులు తేడాతో ఓడించింది.సెంచూరియన్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్ లో టాస్ నెగ్గిన సూపర్ కింగ్స్ మొదట బౌలింగ్ కు దిగింది. దీంతో బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 184 పరుగులు చేసింది. ఐడెన్ మార్క్రమ్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. 40 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 62 అజేయ పరుగులు చేశాడు.ఓపెనర్లు ఓపెనర్ బెడింగ్‌హాం(27), టోనీ డి జోర్జి(14)తో పాటు జోర్డాన్ హెర్మాన్(12), అబెల్(10), ట్రిస్టన్ స్టబ్స్ (26).. ఆఖర్లో మార్కో జాన్సెన్ మెరుపు ఇన్నింగ్స్(12 బంతుల్లో 23)తో ఆకట్టుకున్నాడు. జొబర్గ్ సూపర్ కింగ్స్ బౌలర్లలో ఇమ్రాన్ తాహిర్, విల్‌జోయెన్ తలో రెండు వికెట్లు తీయగా.. మహీశ్ తీక్షణ, మొయిన్ అలీ చెరో వికెట్ తీశారు.లక్ష్య ఛేదనలో నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 152 పరుగులకే పరిమితమైంది సూపర్ కింగ్స్. వికెట్ కీపర్ బ్యాటర్ జానీ బెయిర్‌స్టో మాత్రమే మంచి ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 17 బంతుల్లోనే 37 పరుగులు చేశాడు. ఇవాన్ జోన్స్(22 నాటౌట్) పర్వాలేదనిపించాడు. డెవాన్ కాన్వే(30), కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్(19), విహాన్ ల్యూబే(13), జేపీ కింగ్(9), హార్డస్ విల్‌జోయెన్(14), మొయిన్ అలీ(0), విఫలమయ్యారు. దీంతో 32 పరుగుల తేడాతో విజయం సాధించిన సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్.. క్వాలిఫయర్-2కు అర్హత పొందింది.క్వాలిఫయర్-2 మ్యాచ్‌లో సన్‌రైజర్స్ పార్ల్ రాయల్స్‌తో తలపడనుంది. ఈ పోరులో విజయం సాధించిన జట్టు టైటిల్ పోరులో ముంబయి ఇండియన్స్ కేప్‌టౌన్‌తో పోటీపడనుంది.




# ఛాంపియన్స్ ట్రోఫీకు ముందు బిగ్ షాక్.. బాంబ్ పేల్చిన స్టార్ ప్లేయర్

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025కు ముందు ఆస్ట్రేలియాకు మరో భారీ ఎదురు దెబ్బ తగిలింది.ఆస్ట్రేలియన్ స్టార్ ఆల్ రౌండర్ మార్కస్ స్టోయినిస్ షాకింగ్ డెసిషన్ తీసుకున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు వన్డేలకు గుడ్ బై చెప్పాడు. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం 15 మందితో కూడిన జాబితాలో చోటు దక్కించుకున్న అతడు.. ఇప్పుడీ ఈ అనూహ్య నిర్ణయం తీసుకోవం చర్చనీయాంశంగా మారింది. టీ20 క్రికెట్ పై దృష్టి సారించాలనే ఉద్దేశంతోనే ఈ మార్కస్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు క్రికెట్ వర్గాలు అంటున్నాయి."దేశం తరపున అత్యున్నత స్థాయిలో ప్రాతినిథ్యం వహించడం ఎప్పుడు గొప్పగానే ఉంటుంది. ఇంత అంత ఈజీ డెసిషన్ కాదు. కానీ నేను ఇప్పుడు సరైన సమయంలోనే ఆటకు వీడ్కోలు పలికాను. నా కెరీర్ లోని నెక్ట్స్ చాప్టర్ పై ఇక దృష్టి సారిస్తాను. కోచ్ ఆండ్యూ మెక్ డొనాల్డ్ తో నాకు మంచి అనుబంధం ఏర్పడింది. అతడు నన్ను ఎంతగానో సపోర్ట్ చేశారు." అని మార్కస్ పేర్కొన్నాడు.35 ఏళ్ల మార్కస్ స్టొయినిస్.. కెరీర్ లో 71 వన్డేలు ఆడి 1,495 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీతో పాటు 6 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 48 వికెట్లు పడగొట్టాడు. ఆస్ట్రేలియా తరపున స్టోయినిస్ తన చివరి వన్డే మ్యాచ్ ను పాకిస్థాన్ పై ఆడాడు. ఆ మ్యాచ్ లో 8 పరుగులు చేశాడు. తన బౌలింగ్ లో 11 పరుగులు ఇచ్చాడు.కాగా ఛాంపియన్స్ ట్రోఫీ కోసం ప్రకటించిన జట్టు నుంచి ఇప్పటికే కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్, మిచెల్ మార్ష్, జోష్ హెజిల్ వుడ్ ఆడటం అనుమానంగా మారింది. ఈ క్రమంలోనే ఇప్పుడు మార్క్ స్టోయినిస్ రిటైర్మెంట్ నిర్ణయం ప్రకటించి బాంబు పేల్చాడు.




# విరాట్ కోహ్లీకి గాయమా? సాకుతో తప్పించారా?



ఇంగ్లండ్‌తో తొలి వన్డేకు టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ దూరమయ్యాడు. అతను కుడి మోకాలి నొప్పితో బాధపడుతున్నాడని, ముందస్తు చర్యల్లో భాగంగానే విశ్రాంతి కల్పించామని టాస్ సందర్భంగా కెప్టెన్ రోహిత్ శర్మ వెల్లడించాడు. అయితే కోహ్లీ గైర్హాజరీపై అతని అభిమానులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఫిట్‌నెస్ ఫ్రీక్ అయిన కోహ్లీకి మోకాలి నొప్పి అంటే నమ్మశక్యంగా లేదని సోషల్ మీడియా వేదికగా కామెంట్ చేస్తున్నారు.కోహ్లీకి నిజంగానే మోకాలి నొప్పి ఉందా? లేక సాకుతో తప్పించారా? అని ప్రశ్నిస్తున్నారు. గత కొద్ది రోజులుగా విరాట్ కోహ్లీ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో కోహ్లీ తీవ్రంగా నిరాశపరిచాడు. 9 ఇన్నింగ్స్‌ల్లో ఒకే ఒక్క శతకం నమోదు చేశాడు. 8 సార్లు ఔట్ సైడ్ ఆఫ్ స్టంప్ డెలివరీకే ఔటయ్యాడు. దాంతో అతనిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. జట్టు నుంచి తప్పించాలనే డిమాండ్ కూడా వ్యక్తమైందిఆసీస్ పర్యటన అనంతరం కుటుంబ సభ్యులతో గడిపిన కోహ్లీ.. రంజీ ట్రోఫీలో ఢిల్లీ తరపున ఓ మ్యాచ్ ఆడాడు. రైల్వేస్‌తో జరిగిన మ్యాచ్‌లో 12 ఏళ్ల తర్వాత బరిలోకి దిగాడు. కానీ ఈ మ్యాచ్‌లోనూ 15 బంతుల్లో 6 పరుగులే చేసి క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఈ మ్యాచ్‌కు ప్రేక్షకులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. కానీ కోహ్లీ ఆశించిన రీతిలో రాణించలేకపోయాడు.ఈ క్రమంలోనే తన బ్యాటింగ్ శైలికి సరిపోయే వన్డే ఫార్మాట్‌తోనే కోహ్లీ ఫామ్‌లోకి వస్తాడని ఫ్యాన్స్ భావించారు. కానీ గాయం కారణంగా అతను తొలి వన్డేకు దూరమవ్వడం అభిమానులకు నిరాశను మిగిల్చింది. ప్రాక్టీస్ సందర్భంగా కోహ్లీ తన కుడి మోకాలికి పట్టీ వేసుకొని కనిపించాడు.ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఇంగ్లండ్ బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్లు ఫిల్ సాల్ట్, బెన్ డకెట్ అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. యశస్వి జైస్వాల్, శ్రేయస్ అయ్యర్ స్టన్నింగ్ ఫీల్డింగ్‌తో ఈ ఇద్దరూ వరుసగా ఔటయ్యారు. దాంతో ఇంగ్లండ్ 111 పరుగులకు 4 వికెట్లు కోల్పోయింది.

# ఏంటి రాణా.. మొన్న అదరగొట్టావ్.. ఇప్పుడేమో చెత్త రికార్డ్ ఇచ్చావ్



టీమిండియా - ఇంగ్లాండ్ జట్ల మధ్య నాగ్‌పూర్ వేదికగా మొదలైన తొలి వన్డేతో భారత యువ ఆటగాళ్లు యశస్వి జైశ్వాల్, హర్షిత్ రాణా వన్డే అరంగేట్రం చేశారు. అయితే టీ20 సిరీస్ లో కంకషన్ సబ్‌స్టిట్యూట్ గా అరంగేట్రం ఇచ్చి అదిరే ప్రదర్శన చేసిన హర్షిత్ రాణా.. వన్డే అరంగేట్రాన్ని మాత్రం చెత్త రికార్డుతో మొదలు పెట్టాడు. వచ్చీ రాగానే అతడు ఓ చెత్త రికార్డును నమోదు చేశాడు.ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ ఆరో ఓవర్ ను హర్షిత్ రాణా బౌలింగ్ చేయగా.. ఈ ఓవర్‌లో ఇంగ్లాండ్ స్టార్ ఓపెనర్ ఫిలిప్ సాల్ట్ ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ఓవర్ ను ఏకంగా సిక్స్ తో ప్రారంభించాడు. మొత్తంగా ఈ ఓవర్ లో ఏకంగా మూడు సిక్సర్లు, రెండు ఫోర్లు బాదేశాడు. ఈ ఓవర్ తొలి బంతిని సాల్ట్ బాదగా.. అది కీపర్ కఎల్ రాహుల్ తల మీదుగా వెళ్లింది. రెండు బంతిని కవర్ డ్రైవ్ చేయగా అది బౌండరీని టచ్ చేసింది. మూడో బంతిని హర్షిత్ రాణా ఆఫ్ స్టంప్ వెలుపల వేయగా.. సాల్ట్ మోకాలి మీద కూర్చొని బ్యాక్ వర్డ్ స్క్వేర్ లెగ్ మీదుగా స్లాగ్ స్వీప్ ఆడాడు. దీంతో మళ్లీ సిక్స్ నమోదైంది. నాలుగో బంతిని లెంగ్త్ డెలివరీ చేయగా.. దాన్ని ఫోర్ బాదాడు. ఐదోది డాట్ బాల్. ఇక ఆరోది షార్ట బాల్ వేయగా.. మిడ్ వికెట్ మీదుగా భారీ సిక్స్ బాదాడు సాల్ట్. అలా 6, 4, 6, 4, 0, 6 బాది.. ఈ ఓవర్‌లో 26 పరుగులు సాధించాడు. ఈ నేపథ్యంలో వన్డే అరంగ్రేట మ్యాచ్‌లో.. ఓ ఓవర్‌లో అత్యధిక పరుగులు సమర్పించుకున్న చెత్త రికార్డును హర్షిత్ ఖాతాలో వేసుకున్నాడు.అయితే ఈ చెత్త రికార్డు నమోదు చేశాక హర్షిత్ రాణా గట్టి కమ్ బ్యాక్ ఇచ్చాడు. రెండో ఓవర్ లోనే రెండు కీలక వికెట్లు పడగొట్టాడు. బెన్ డకెట్, హ్యారీ బ్రూక్ ను పెవిలియన్ పంపాడు. కాగా, గాయం కారణంగా ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా స్టార్ పేసర్ బుమ్రా ఆడే అవకాశాలు చాలా తక్కువగా కనిపిస్తున్నాయి. అతడు ఆడటం అనుమానంగా మారింది. దీంతో అతడికి ప్రత్యామ్నాయంగా హర్షిత్ కు అవకాశం ఇవ్వాలని గంభీర్ భావిస్తున్నాడట. అందుకే ఈ తొలి వన్డే మ్యాచ్‌లో అతడికి అవకాశం ఇచ్చినట్లు తెలిసింది.

# 'నాకు ఇష్టమైన నిక్ నేమ్ అదే'.. తెలుగోళ్లంటే కేన్ మామకు ఎంత ప్రేమో!

మనుషుల్ని కలుపుకునే విషయంలో లేదా ఆరాధించే విషయంలో మన తెలుగువారికి ఓ అలవాటు ఉంది. అది ఏంటంటే.. వాళ్లకు సాధరణంగానే ఓ పట్టాన ఎవరూ అంత ఈజీగా నచ్చరు.. కానీ ఒక్కసారి నచ్చితే మాత్రం వారిని అస్సలు వదలుకోరు. తల మీద పెట్టుకుని ఆరాధిస్తారు. క్రికెటర్స్ విషయంలోనైనా అంతే. అయితే భారత క్రికెటర్లు కాకుండా విదేశీ ప్లేయర్స్ లో మనోళ్లు ఎవరినైనా ఎక్కువ ఆదరించారంటే అది డేవిడ్ వార్నర్, కేన్ విలియమ్సనే అని చెప్పాలి.గతంలో ఐపీఎల్ లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ప్రాతినిథ్యం వహించిన వీరిద్దరూ తెలుగువాళ్ల అభిమానాన్ని చూరగొన్నారు. అయితే వార్నర్ విషయం కాసేపు పక్కనపెడితే.. విలియమ్సన్ ను మనవాళ్లు ముద్దుగా కేన్ మామ అని పిలుస్తుంటారన్న సంగతి తెలిసిందే. సందర్భంగా ఏదైనా కేన్ మామ అని అంటుంటారు. అంతలా తెలుగువారి మదిలో స్థానాన్ని సంపాదించుకున్నాడతడు.అయితే తాజాగా కేన్.. ఇండియన్స్ తో తనకున్న అనుబంధం గురించి మాట్లాడాడు. తన ఫేవరెట్ నిక్ నేమ్ కూడా కేన్ మామ అని చెప్పాడు. ఈ పేరును పెట్టింది మన తెలుగోళ్లే కావడం విశేషం. ప్రస్తుతం కేన్ విలియమ్సన్.. సౌతాఫ్రికా టీ20 లీగ్‌లో ఆడుతున్నాడు. ఈ క్రమంలోనే తాను ప్రాతినిధ్యం వహిస్తోన్న దర్బన్ సూపర్ జెయింట్స్ జట్టులోని మరో సభ్యుడు హెన్రిచ్ క్లాసిన్ తో.. చిట్ చాట్ సెషన్ లో పాల్గొన్నాడు కేన్. ఇందులో 'నీకు బాగా నచ్చిన, ఇష్టమైన నిక్ నేమ్ ఏంటి?' అని కేన్ విలియమ్సన్ ను ప్రశ్నించాడు హెన్రీచ్ క్లాసిన్. దానికి కేన్.. 'ఇండియాలో నన్ను కేన్ మామ అని పిలుస్తారు. అలా పిలుస్తే నాకెంతో ఇష్టం' అని చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం ఈ సమాధానం భారత క్రికెట్ అభిమానులను బాగా ఆకట్టుకుంటోంది.

# నిద్రలో ఈ రకమైన కలలు వస్తున్నాయా.. బీ కేర్ ఫుల్ !



కలలు.. సాధారణంగా నిద్రపోయేటప్పుడు ప్రతి మనిషికి ఇవి వస్తుంటాయి. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ కలలు కంటారు. మనం రోజంతా ఏమి ఆలోచిస్తామో దానిపైనే మన కలలు ఆధారపడి ఉంటాయి. అయితే కొందరు కలలను గుర్తుంచుకుంటే.. మరికొందరు మర్చిపోతుంటారు. ఇంకొందరు మాత్రం కలని అటు పూర్తిగా మర్చిపోకుండా.. ఇటు పూర్తిగా గుర్తు పెట్టుకోకుండా సగం సగంగా ఉండిపోతుంటారు. కలల్లో కొంతమందికి మంచి కలలు వస్తే మరి కొంతమందికి చెడు కలలు వస్తాయి. అయితే మనం రోజంతా ఏమి ఆలోచిస్తామో అది కూడా మన కలల్లోకి వస్తుందని డాక్టర్లు చెబుతుంటారు. అయితే మనకు వచ్చే ప్రతీ కలకు ఒక నిర్ధిష్టమైన అర్థం ఉంటుందని.. కలలు ఎన్నో రకాలు ఉన్నట్లే వాటి అర్థాలు కూడా విభిన్నంగా ఉంటాయని పండితులు అంటుంటారు. ఇందుకు సంబంధించిన విషయాలు స్వప్న శాస్త్రంలో కూడా పొందుపరిచి ఉన్నాయని స్పష్టం చేస్తున్నారు. ంశ్రీబనీ ఖీవజీట 30 ఏళ్ల తర్వాత శనిదేవుని రాజయోగం..ఈ రాశుల వారికి పంట పండినట్టే..! కలలో మనం ఆలోచించే విషయాలు కనిపిస్తాయని చెబుతున్నప్పటికీ.. కొన్నిసార్లు మనం చూడని ప్రదేశాన్ని, స్థలాన్ని కూడా ఎందుకు చూస్తుంటాం అని కొందరు సందేహం వ్యక్తం చేస్తున్నారు. కొంతమందికి అప్పుడప్పుడు పీడకలలు వస్తాయి. అయితే కొంతమందికి ప్రతిరోజూ చెడు కలలు వస్తాయి. కొంతమంది అయితే ఏకంగా రాత్రిపూట చెడు కల కారణంగా అకస్మాత్తుగా మేల్కొంటూ ఉంటారు. రెగ్యులర్ గా చెడు, భయానక కలలు పదే పదే వస్తుంటే.. మానసిక ఆరోగ్యంపై ప్రభావాన్ని చూపుతుందని హెచ్చరిస్తున్నారు. శారీరక ఆరోగ్యంపై ఇది హాని చేస్తుందని.. అందుకే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఇలా తరచుగా వచ్చే పీడకలలు ఆరోగ్యానికి హాని కలిగిస్తాయనే మానసిక వైద్యులు సూచిస్తున్నారు. ఈ తరహా లక్షణాన్ని పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్ గా భావించవచ్చని చెబుతున్నారు. అందుకే రోజూ చెడు కలలు వస్తూ ఉంటే ఒత్తిడికి దూరంగా ఉండాలని అంటున్నారు. మరి ముఖ్యంగా చెడు కలలు రాకుండా ఉండాలంటే పగటిపూట నిద్రపోవడం మానుకోవాలని వెల్లడిస్తున్నారు. రాత్రి పడుకోవడానికి.. ఉదయం నిద్ర లేవడానికి ఒక సమయాన్ని నిర్ణయించుకోవాలని సూచిస్తున్నారు. సాయంత్రం 4 గంటల తర్వాత టీ, కాఫీ తాగడం కూడా మానేయ్యాలని వివరించారు. రాత్రిపూట వ్యాయామం చేయవద్దని తెలిపారు. అలానే రాత్రి భోజనంలో పాలు, అరటిపండు తీసుకోవాలంటున్నారు.

# ఉల్లిపాయలు, తేనె కలిపి తీసుకుంటే మగవారిలో కలిగే మహాద్భుత మార్పులు ఇవే!

ఉల్లిపాయలు  మరియు తేనె ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను అందిస్తాయి. వీటిని కలిపి తీసుకోవడం వల్ల శరీరానికి చాలా రకాలుగా మేలు జరుగుతుందని ఆయుర్వేదం, సిద్ధ వైద్యం, మరియు అనేక ఇతర సంప్రదాయ వైద్య పద్ధతులు సూచిస్తున్నాయి. ముఖ్యంగా, పురుషుల్లో వీర్య కణాల సంఖ్య  మరియు నాణ్యత (రాజూవతీఎ మెరుగుపడే అవకాశం ఉందని కొంత పరిశోధన చెబుతోంది. ఉల్లిపాయలు - వీర్య కణాల పెరుగుదల ఉల్లిపాయలు  సహజసిద్ధమైన యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్లను కలిగి ఉంటాయి. వీటి వల్ల శరీరంలో ఉచిత రాడికల్స్ తగ్గుతాయి. అధిక ఉచిత రాడికల్స్ వల్ల వీర్య కణాల నాశనం జరుగుతుంది. అయితే, ఉల్లిపాయల్లో ఉండే క్వెర్సిటిన్  అనే పదార్థం వీర్య కణాలను రక్షించడంలో సహాయపడుతుంది.టెస్టోస్టెరోన్ స్థాయిలను పెంచుతుంది. వీర్యకణాలు గర్భాశయంలో చురుకుగా ఉండేందుకు సహాయపడుతుంది.అమెరికాలో తేలిన భారతీయ వలసల లెక్క-వీరు స్వదేశానికి-మిగిలిన వాళ్లు జైల్లో..! తేనె -వీర్య కణాల పెరుగుదల తేనె సహజసిద్ధమైన ఔషధ గుణాలు కలిగిన పోషకాహారం. ఇది పురుషుల ఫెర్టిలిటీ  మెరుగుపరచడంలో సహాయపడుతుందని పరిశోధన చెబుతోంది.టెస్టోస్టెరోన్ స్థాయిలను పెంచుతుంది. దీనిలోని యాంటీఆక్సిడెంట్లువీర్యకణాలను రక్షించి ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి.నరాల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే గుణాలు తేనెలో ఉన్నాయి. వీర్య నాళాల ఆరోగ్యాన్ని మెరుగుపరచి, వీర్య కణాల బలాన్ని పెంచుతుంది. ఉల్లిపాయలు తేనే హార్మోన్లను ఎలా ప్రభావితం చేస్తాయి? ఉల్లిపాయలు ల్యూటినైజింగ్ హార్మోన్ (ఒఊ) ఉత్పత్తిని పెంచేలా చేస్తాయి. ఇది పురుషుల్లో టెస్టోస్టెరోన్ స్థాయిలను పెంచేందుకు సహాయపడుతుంది. శృంగార సామర్థ్యాన్ని పెంచే సహజ ఔషధంగా పనిచేయడంతో పాటు వీర్య కణాలను బలపరేచే గుణాలు కలిగి ఉన్నాయి. తేనెలో ఉండే ఫైటోన్యూట్రియంట్లు శరీరంలో హార్మోన్ల సమతుల్యతను మెరుగుపరిచేలా సహాయపడతాయి . అంతే కాకుండాతేనెను తినడం వల్ల శరీరంలో కొవ్వు తగ్గి టెస్టోస్టెరోన్ ఉత్పత్తి ఎక్కువగా జరుగుతుంది. ఉల్లిపాయల �c తేనె మిశ్రమం రక్తనాళాలను శుభ్రంగా ఉంచి రక్తప్రసరణ మెరుగుపరుస్తుంది. ఇది ప్రత్యేకంగా పీనిస్ వైపు ఎక్కువ రక్త ప్రవాహాన్ని ఉత్పత్తి చేస్తుంది. ఆధునిక జీవన శైలిలో ఎక్కువ ఒత్తిడి  కారణంగా వీర్య కణాల నాశనం జరుగుతుంది. ఉల్లిపాయలు మరియు తేనె కోర్టిసోల్  తగ్గించి, మెదడు శక్తిని పెంచుతాయి. శరీరంలో హార్మోన్ల సమతుల్యత పెరిగితే నిద్ర సమస్యలు తగ్గుతాయి. ఇది కూడా పురుషుల వీర్య నాణ్యతను పెంచేలా సహాయపడుతుంది.“డేంజర్ వ్యాధులను సహితం మట్టుపెట్టు పెట్టే సూపర్ ఫుడ్ !.. రోజూ ఇలా ట్రై చేయండి.” ఎలా తీసుకోవాలి? ఉల్లిపాయ రసం c తేనె మిశ్రమం కలిపి తీసుకోవాలి. తాజా ఉల్లిపాయ రసం (1 టీస్పూన్) + తేనె (1 టీస్పూన్) కలిపి రోజుకు 2 సార్లు తీసుకుంటే మంచిది. అంతే కాకుండా ఉల్లిపాయల c తేనె సూప్ రూపంలోనూ, ఉల్లిపాయ ముక్కలను ఉడకబెట్టి, తేనె కలిపి తీసుకోవచ్చు. ఈ సమాచారం కేవలం సాధారణ అవగాహన కోసం మాత్రమే. వైద్య సలహాకు బదులుగా కాదు. ఏదైనా ఆరోగ్య సమస్యల విషయంలో మీ వైద్యుడిని సంప్రదించడం మంచిది.



# డేంజర్ వ్యాధులను సహితం మట్టుపెట్టు పెట్టే సూపర్ ఫుడ్ !.. రోజూ ఇలా ట్రై చేయండి.

క్వినోవా అనేది పోషకాలను సమృద్ధిగా కలిగి ఉన్న శక్తివంతమైన ధాన్యం. ఇది ప్రధానంగా దక్షిణ అమెరికా దేశాల్లో ఉత్పత్తి అవుతూ, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య స్నేహితుల ఆహార జాబితాలో కీలకంగా మారింది. ఇది ప్రోటీన్లకు గొప్ప మూలంగా ఉండటమే కాకుండా, గ్లూటెన్-ఫ్రీ ఫుడ్ కావడం వల్ల చాలా మంది ఆరోగ్య పరంగా దీన్ని తమ డైట్‌లో భాగం చేసుకుంటున్నారు. దీన్ని ఆహారంగా చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. క్వినోవా యొక్క ప్రయోజనాలు: క్వినోవాలో మన శరీరానికి అవసరమైన తొమ్మిది ముఖ్యమైన అమైనో ఆమ్లాలు ఉంటాయి. ఇది శాకాహారులు మరియు శాఖాహారులకు ప్రోటీన్ యొక్క గొప్ప మూలం. దీనిలో ఫైబర్ అధికంగా ఉంటుంది, ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది . మలబద్ధకాన్ని నివారిస్తుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. క్వినోవాలో ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, విటమిన్ ః వంటి అనేక ముఖ్యమైన విటమిన్లు , ఖనిజాలు ఉంటాయి. ఇవి మన ఆరోగ్యానికి చాలా అవసరం. ఈ ధాన్యంలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి, ఇవి మన శరీరాన్ని ఫ్రీ రాడికల్స్ నుండి రక్షిస్తాయి . క్యాన్సర్, గుండె జబ్బుల వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి.  30 ఏళ్ల తర్వాత శనిదేవుని రాజయోగం..ఈ రాశుల వారికి పంట పండినట్టే..!: కోళ్లలో అంతుచిక్కని వైరస్.. లక్షల్లో మృత్యువాత..! క్వినోవా గ్లూటెన్ రహితమైనది, కాబట్టి ఇది ఉదరకుహర వ్యాధి లేదా గ్లూటెన్ సెన్సిటివిటీ ఉన్నవారికి మంచి ఎంపిక. దీనిలో ఫైబర్, ప్రోటీన్ అధికంగా ఉండటం వల్ల ఇది మనకు ఎక్కువసేపు కడుపు నిండిన భావనను కలిగిస్తుంది, దీని వలన మనం తక్కువ ఆహారం తీసుకుంటాము మరియు బరువు తగ్గడానికి సహాయపడుతుంది. క్వినోవాలో మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు, ఒమేగా -3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి, ఇవి గుండె ఆరోగ్యానికి చాలా మంచివి. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో మరియు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. క్వినోవాలో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల ఇది రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుంది , డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. దీనిని అన్నం లాగా వండుకోవచ్చు లేదా సలాడ్లు, సూప్‌లు, స్మూతీలలో కూడా ఉపయోగించవచ్చు. దీనిని పిండిగా కూడా ఉపయోగించి రొట్టెలు, ఇతర బేక్ చేసిన వస్తువులను తయారు చేయవచ్చు. ఇది పోషకమైన ఆరోగ్యకరమైన ఆహారం. దీనిని మీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల మీరు అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.



# మద్యం తాగుతున్నారా..? అయితే మీకు ఆ కష్టం వచ్చినట్టే..!



ప్రస్తుతం ఉన్న సమాజంలో ఆల్కహాల్ అనేది ప్రతి ఒక్కరి జీవితంలో భాగమైంది. నేటి జీవనశైలిలో పురుషులు, మహిళలు ఇద్దరూ బహిరంగంగా మద్యం సేవిస్తున్నారు.తాగేవారికి తాగడానికి ఒక సాకు అవసరమని మీరు వినే ఉంటారు.అది ఇంట్లో పార్టీ అయినా, స్నేహితులతో విహారయాత్ర అయినా లేదా ఆ రోజు అలసట, ఒత్తిడిని వదిలించుకోవడానికి మద్యం సేవిస్తూ ఉంటారు.అయితే మద్యం తాగడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. ముఖ్యంగా చాలా మందికి సంతానోత్పత్తి సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రస్తుతం జనరేషన్‌లో 20 శాతానికి పైగానే సంతానోత్పత్తి సమస్యలతో బాధపడుతున్నారు.మద్యం తాగడం వల్ల పునరుత్పత్తి వ్యవస్థపై కొన్ని ప్రతికూల ప్రభావాలు ఉంటాయని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. మద్యం తాగడం వల్ల పురుషులలో: మద్యం తాగడం వల్ల స్పెర్మ్ కౌంట్ తగ్గిపోవచ్చు, స్పెర్మ్ కదలిక తగ్గిపోవచ్చు మరియు స్పెర్మ్ ఆకారం మారిపోవచ్చు. దీనివల్ల గర్భధారణ కష్టం కావచ్చు. మద్యం తాగడం వల్ల టెస్టోస్టెరాన్ ఉత్పత్తి తగ్గిపోవచ్చు, ఇది పురుషులలో లైంగిక కోరికను మరియు పునరుత్పత్తి సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. మద్యం తాగడం వల్ల అంగస్తంభన సమస్యలు వచ్చే అవకాశం ఉంది, ఇది కూడా గర్భధారణను కష్టతరం చేస్తుంది. ంశ్రీబనీ ఖీవజీట తెలుగు స్టాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు బిగ్ షాక్ ..ఇక తట్ట బుట్టా సర్దుకోండి..! మద్యం తాగడం వల్ల మహిళలలో: మద్యం తాగడం వల్ల గర్భధారణ సమస్యలు వచ్చే అవకాశం ఉంది, ఇది గర్భధారణను కష్టతరం చేస్తుంది.మద్యం తాగడం వల్ల హార్మోన్ల అసమతుల్యత వచ్చే అవకాశం ఉంది, ఇది పునరుత్పత్తి వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. గర్భధారణ సమయంలో మద్యం తాగడం వల్ల గర్భస్రావం అయ్యే ప్రమాదం పెరుగుతుంది. మద్యం తాగడం మరియు గర్భధారణ: మీరు గర్భం ధరించడానికి ప్రయత్నిస్తుంటే, మద్యం తాగడం మానేయడం లేదా తగ్గించడం మంచిది.మీరు గర్భవతిగా ఉంటే, మద్యం తాగడం పూర్తిగా మానేయాలి. ముగింపు: మద్యం తాగడం వల్ల పిల్లలు పుట్టడం కష్టమవుతుందా లేదా అనే దానిపై ఖచ్చితంగా చెప్పలేము, అయితే మద్యం తాగడం వల్ల పునరుత్పత్తి వ్యవస్థపై కొన్ని ప్రతికూల ప్రభావాలు ఉంటాయని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. మీరు గర్భం ధరించడానికి ప్రయత్నిస్తుంటే, మద్యం తాగడం మానేయడం లేదా తగ్గించడం మంచిది.






# తెలుగు సినిమా పుట్టిన రోజు సందర్భంగా కీలక నిర్ణయాలు తీసుకున్న ఫిల్మ్ ఛాంబర్

ఫిబ్రవరి 6.. తెలుగు సినిమా పుట్టిన రోజుగా చేయాలని నిర్ణయించింది తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్. ఇకపై ప్రతి యేడాది ఈ రోజును తెలుగు సినిమా పుట్టిన రోజుగా నిర్వహించాలని నిర్ణయించారు. ప్రభుత్వం అందించే అవార్డులతో పాటు, ఛాంబర్ తరఫు నుంచి వివిధ కేటగిరీల్లో అవార్డులు కూడా అందించాలనే నిర్ణయం జరిగింది. తెలుగు సినిమా పుట్టినరోజున ప్రతి సినిమా నటుడు ఇంటిపై, థియేటర్ల వద్ద ప్రత్యేకంగా జెండా ఆవిష్కరించాలని నిర్ణయం జరిగింది. ఈ జెండా రూపకల్పన బాధ్యతను సీనియర్ రచయిత పరిచూరి గోపాలకృష్ణకు అప్పగించింది ఫిల్మ్ ఛాంబర్. తొలి తెలుగు టాకీ సినిమాకు సంబంధించి వివరాలను ఎంతో రీసెర్చ్ చేసి భక్త ప్రహ్లాద గురించి తెలిపిన సీనియర్ జర్నలిస్ట్ రెంటాల జయదేవ కృషిని గుర్తు చేసుకుంటూ.. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ భరత్ భూషణ్ ఆధ్వర్యంలో ఇదే వేదికపై ఆయన రచించిన 'మన సినిమా ఫస్ట్ రీల్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఇక తెలుగు సినిమా పుట్టిన రోజు సందర్భంగా సీనియర్ రైటర్ పరుచూరు గోపాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ప్రెస్ మీట్ లో ఛాంబర్ ప్రెసిడెంట్ దామోదర ప్రసాద్ మాట్లాడుతూ.. "తెలుగు ఫిల్మ్ ఛాంబర్ తరఫున తెలుగు సినిమా దినోత్సవం మొదటిసారి చేయడం జరుగుతుంది. అంతకు ముందు కొన్ని సంస్థలు చేశాయి. ఈయేడాది నుంచి ఛాంబర్ తరఫు నుంచి చేయాలని నిర్ణయించుకున్నాం. సినిమా అనేది మా అందరికీ తల్లి లాంటిది. తెలుగు సినిమా ఛాంబర్ మదర్ బాడీ ఇక నుంచి ప్రతి సంవత్సరం చేయాలని డిసైడ్ చేశాం. మొదటి యేడాది కాబట్టి ఈ సారి నార్మల్ గా చేస్తున్నాం. నెక్స్ట్ ఇయర్ నుంచి గ్రాండ్ గా నిర్వహించబోతున్నాం. పాత తరం కళాకారులకు మరిన్ని సన్మానాలు చేస్తాం. సినిమా హిస్టరీ గురించి చెబితే.. సినిమా అనేది ఫస్ట్. బర్త్ ఆఫ్ సినిమా ముఖ్యం. చాలామంది ఎన్నో చరిత్రలు క్రియేట్ చేశారు. కానీ బర్త్ ఆఫ్ సినిమా అనేది ముఖ్యం. రాబోయే తరాలు కూడా ఇది గుర్తుంచుకోవాలి. జనాలు వస్తుంటారు పోతుంటారు. కానీ పుట్టుక అనేది చాలా ఇంపార్టెంట్. ప్రతి ఒక్కరూ ఇది గుర్తుంచుకోవాలి. ఇక ఈ రోజును గురించి పాతికేళ్ల పాటు రీసెర్చ్ చేసి మొదటి తెలుగు టాకీ సినిమా డేట్ ను ఖచ్చితంగా గుర్తించి ప్రపంచానికి తెలియజేసిన సీనియర్ జర్నలిస్ట్ రెంటాల జయదేవ్ గారికి థ్యాంక్స్ చెబుతున్నాను " అన్నారు. ఛాంబర్ సెక్రెటరీ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. "ఇవాళ సినిమా పుట్టిన రోజు. ఫస్ట్ టాకీ ఫిల్మ్ భక్త ప్రహ్లాద. ఈచిత్రానికి హెచ్ఎమ్ రెడ్డి దర్శకుడు. ఈ చిత్రానికి ముందు వేరే వేరే డేట్ అనుకునేవాళ్లం. రెంటాల జయదేవ్ గారు పరిశీలించి ఈ రోజు అని చెప్పడంతో సెలబ్రేట్ చేసుకుంటున్నాం. భక్త ప్రహ్లాద కంటే ముందే కాళిదాసు అనే సినిమా 1931లో వచ్చింది. కాళిదాసు చిత్రంలో నాలుగు రీళ్లు తెలుగులోనే పాటలు, డైలాగులు ఉండి.. తెలుగు దర్శకుడు హెచ్ఎమ్ రెడ్డి దర్శకుడు.. తెలుగువాడైన గంగాధర్ హీరోగా నటించారు. తర్వాత మూడు రీళ్లు తమిళ్ లో ఉండటం కనిపిస్తుంది. ఈ కారణంగా కాళిదాసును తమిళ్ వాళ్లు వాళ్ల సినిమాగా చెప్పుకుంటున్నారు. కానీ వాస్తవంగా కాళిదాసు మన తెలుగు సినిమా. ఫస్ట్ హిందీ టాకీ మూవీ ఆలం ఆరా లో మన ఎల్వీ ప్రసాద్ గారు నటించారు. తెలుగు ఫస్ట్ టాకీ భక్త ప్రహ్లాద, తెలుగు, తమిళ్ ఫస్ట్ టాకీ కాళిదాసు.. ఈ మూడు చిత్రాల్లోనూ ఎల్వీ ప్రసాద్ గారు నటించారు. ఆయన ఆ రోజుల్లో మూకీ నుంచి టాకీ వరకూ యాక్ట్ చేసి.. చాలా కష్టపడి.. ఏడు రోజులు భోజనం లేకుండా బ్రతికి ఈ రోజు ఇంత స్థాయికి వచ్చిన గొప్ప వ్యక్తి ఎల్వీ ప్రసాద్. ఆయనే ఎన్టీ రామారావుగారిని పరిచయం చేశారు. ఇవాళ ప్యాన్ ఇండియా అంటున్నాం. కానీ ఆ రోజుల్లో పాతాళ భైరవి ఎన్టీఆర్ నటించిన 6వ సినిమా. ఇది ఆ రోజుల్లోనే తెలుగు, తమిళ, హిందీ భాషల్లోనూ సూపర్ హిట్ అయ్యి ప్యాన్ ఇండియా సినిమా అనిపించుకుంది. మొదటి తరాల్లో సన్నగా ఉన్నవారికే అవకాశాలు అనుకున్నారు. కానీ తర్వాత ఎన్టీఆర్ లాంటి భారీ మనుషులు, నాగేశ్వరరావు లాంటి వ్యక్తులు వచ్చినప్పుడూ కొన్ని విమర్శలు వచ్చినా.. తర్వాత ఆ ఇద్దరూ తెలుగు సినిమాకు రెండు కళ్లుగా మారడం అనే చరిత్ర చూశాం. ఇక రాజకీయాల్లో ఎన్టీఆర్ సృష్టించిన చరిత్ర గొప్పదే. ఎలా చూసినా ప్రపంచ వ్యాప్తంగా తెలుగు సినిమా గొప్పదనం వ్యాపించి ఉన్న విషయాన్ని మనం గర్వంగా చెప్పుకుందాం.. " అన్నారు. సీనియర్ నటులు, నిర్మాత మురళీ మోహన్ మాట్లాడుతూ.. "అందరికీ నమస్కారం. ఇవాళ సంతోషకరమైన దినం. ఎప్పటి నుంచో చేసుకోవాల్సిన పండగ. ఇప్పటికైనా నిర్వహిస్తున్నందుకు సంతోషం. మనమంతా ఇండస్ట్రీ మీద బ్రతుకుతున్నవాళ్లం. ఒకప్పుడు నాగేశ్వరరావుగారు ఒక మాట అన్నారు. మేం వచ్చినప్పుడు చాలా పెద్ద పోటీ ఉండేది. మాకు సంస్కృతం మాట్లాడటం రాదు.. అప్పుడు వాళ్లు పాటలు కూడా పాడుకున్నారు. మాకు అవేవీ రాకున్నా.. ఎంతో హార్డ్ వర్క్ చేసి తర్వాత తరాలకు ఓ రోడ్ వేశాం. దానిపై మీరంతా హ్యాపీగా వెళుతున్నారు అన్నారు. అది నిజం. అలాంటి మహనీయులు చేసిన కృషే ఇది. మనం గర్వంగా చెప్పుకోదగ్గ వ్యక్తుల్లో ఎల్వీ ప్రసాద్ గారు ఆద్యుడు అని చెప్పాలి. ఆయనతో పాటు ఎందరున్నా.. ఎల్వీ ప్రసాద్ గారు హిందీ, బెంగాలీ చిత్రాల్లోనూ నటించి దర్శకుడుగానూ రాణించి సినిమా స్థాయిని పెంచారు. ఇవాళ రాజకీయ నాయకులకంటే సినిమా వాళ్లకే ప్రజల్లో ఆదరణ ఎక్కువ. రాజకీయ నాయకుడు పదవికాలం పూర్తయ్యాక ప్రజల్లో ఆదరణ ఉండదు. క్రీడాకారులకు కూడా ఆదరణ అంతంత మాత్రమే. సినీ నటులు మాత్రం ఎప్పుడు ప్రేక్షకుల హృదయాల్లో ఉంటారు. ఫిబ్రవరి 6న తెలుగు సినిమా దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనందంగా ఉంది. మద్రాసులో ఉన్నప్పుడు మేం సినిమా కులమని గర్వంగా చెప్పుకునేవాళ్లం. అలాంటి సినిమాకు సంబంధించి ప్రతి సంవత్సంర పండగ చేసుకోవాలి. ఇప్పటికైనా చేస్తున్నందుకు అందరినీ అభినందిస్తున్నాను. సినిమా పరిశ్రమలో అన్ని విభాగాల వాళ్లు సమన్వయం చేసుకుని నిర్వహిస్తే ఇంకా బావుంటుంది. తెలుగు సినిమాకు సంబంధించి భక్త ప్రహ్లాద ఫైనల్. ఫిబ్రవరి 6 అనే డేట్ బావుంది. మనమంతా సినిమా ప్రపంచంలో ఉన్నాం అని చెప్పుకోవడానికి గర్వపడాలి. ఎంతోమంది నిర్మాతల కృషి వల్లే మనమంతా ఈ స్థాయిలో ఉన్నాం. వచ్చే యేడాది ఈ పండగను గ్రాండ్ గా నిర్వహించుకుందాం.. " అన్నారు. మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మాదాల రవి మాట్లాడుతూ.. "అందరికీ నమస్కారం. ఒక మనిషి పుట్టిన రోజునే గ్రాండ్ గా సెలబ్రేట్



చేసుకుంటారు. సిల్వర్ జూబ్లీ అని గోల్డెన్ జూబ్లీ అని. అలాంటిది ఒక పెద్ద పరిశ్రమ.. సినిమా పుట్టిన రోజు. మొట్టమొదటిసారిగా ఒక తెలుగు సినిమా థియేటర్ లో విడుదలైన రోజు. భక్త ప్రహ్లాద రిలీజ్ అయిన రోజు అంటే ఫిబ్రవరి 6న తెలుగు సినిమా పుట్టిన రోజుగా జరుపుకోవాలని నిర్ణయించడం గొప్ప విషయం. నాటి నుంచి నేటి వరకూ ఎందరో గొప్ప నటులు వచ్చారు. ఎన్టీఆర్, ఏఎన్నార్ ఇండస్ట్రీ రెండు కళ్లు అని చెప్పుకుంటాం. వీరిలాంటి ఎందరో మహా నటులు, దర్శకులు, రచయితలు, నిర్మాతలు, గాయకులు.. మొత్తం 24 క్రాఫ్ట్ లో లెజెండ్స్ తో నిండిపోయింది. తెలుగు సినిమా ఇవాళ దశదిశలా వ్యాపించింది. తెలుగు సినిమా ఇప్పుడు ప్రపంచ సినిమా అయింది. అందుకు కారణం గొప్ప టెక్నీషియన్స్, దర్శకుల వల్లే అయింది. ఒకప్పుడు మనల్ని మదరాసీలు అనేవాళు.. అలాంటిది మన సినిమా వైపు యావత్ ప్రపంచ చూస్తోంది. ఈ ఖ్యాతిని పెంచడానికి ఎన్టీఆర్ కాలంనాటి నుంచి ప్రయోగాలు జరుగుతూనే ఉన్నాయి. తెలుగు సినిమా ఈ వందేళ్లో రంజింప చేయడమే కాదు.. ఆలోచింప చేయడంతో పాటు చైతన్యం తీసుకు వచ్చే ప్రయత్నమూ చేసింది. సమాజం మార్పు సినిమా వల్ల తెలుస్తుంది. ఇలాంటి ఎన్నో గొప్ప అంశాలతో ముడిపడి ఉన్న తెలుగు సినిమా పుట్టిన రోజును అన్ని సంఘాలూ కలిసి గ్రాండ్ గా నిర్వహించుకోవాలని.. ఈ పుట్టిన రోజు సందర్భంగా మా మా అసోసియేషన్ నుంచి అందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.." అన్నారు. దర్శకుల సంఘం అధ్యక్షుడు వీర శంకర్ మాట్లాడుతూ.. "మన తెలుగు టాకీ సినిమా పుట్టిన రోజు శుభాకాంక్షలు. థియేటర్స్ లోని గేట్ కీపర్స్ నుంచి మేకర్స్ వరకూ అందరికీ ఇది పెద్ద పండగ. ఈ యేడాది ఛాంబర్ ఈ పండగను నిర్వహించాలని నిర్ణయించడం గొప్ప విషయం. మన దేశం నుంచి ఆగస్ట్ 15 ను ఎంత గొప్పగా జరుపుకుంటామో.. అలా తెలుగు సినిమా పుట్టిన రోజును కూడా జరుపుకోవాలని కోరుకుంటున్నాను. అలాగే వచ్చే యేడాది గ్రాండ్ గా నిర్వహించాలని నిర్ణయించిన సందర్భంగా మా దర్శకుల సంఘంకి ఎలాంటి బాధ్యత ఇచ్చినా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఈ రోజును వెలికి తీసే పరిశోధన చేసిన రెంటాల జయదేవ్ గారికి కృతజ్ఞతలు. కాళిదాసును తెలుగు సినిమా అని చెప్పుకోవడంలో కొంత వెనకబడ్డాం అనే చెప్పాలి. మొదటిసారిగా తెలుగు డైలాగులు స్క్రీన్ పైన వినిపించిన చిత్రం కాళిదాస్ కాబట్టి ఆ చిత్రాన్ని కూడా మనం ఓన్ చేసుకోవాలి. తెలుగు సినిమాకు పితామహుడైన హెచ్ఎమ్ రెడ్డి ఆ రోజున చేసిన ప్రయత్నమే ఈ పండగకు ఆద్యం. సినిమా చాలా శక్తివంతమైనది. ఒకప్పుడు రైతుబిడ్డ అనే చిత్రాన్ని చల్లపల్లి రాజా వారు నిర్మించారు. ఆ సినిమా చూసిన జనం రాజా వారిపైనే తిరుగుబాటు చేశారు. సినిమాకు అంత శక్తి ఉంది. క్రైమ్ సినిమాకు ముందు తర్వాత ఉంది. సినిమాల వల్ల క్రైమ్ పెరగడం లేదు. మనుషుల్లో ఉన్న నేర ప్రవృతినే సినిమాల ద్వారా చూపిస్తున్నాం. సినిమాలు సమాజాన్ని చెడగొట్టవు. సినిమా వాళ్ల గురించి తక్కువగా మాట్లాడే వారిపై ఫిల్మ్ ఛాంబర్, నిర్మాతల మండలి కఠినంగా వ్యవహారించాలని కోరుకుంటున్నా" అన్నారు.తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి అనుపమ్ రెడ్డి మాట్లాడుతూ.. "అందరికీ తెలుగు సినిమా పుట్టిన రోజు శుభాకాంక్షలు. ఇది సాధారణంగా నిర్వహించాం. ఇవాళ బీజం వేశాం. రాబోయే రోజుల్లో మహా వృక్షంగా మారి అందరికీ తెలుగు సినిమా గొప్పదనం తెలిసేలా నిర్వహిస్తాం. ఈ సందర్భంగా రెంటాల జయదేవ్ గారికి ధన్యవాదాలు" అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ భరత్ భూషణ్, ముత్యాల రాందాస్, నిర్మాత ఆచంట గోపీనాథ్, తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, పద్మజ, సీనియర్ ప్రొడ్యూసర్ వేమూడు సత్యనారాయణ, నిర్మాత సాంబశివరావు, ఫైటర్స్ యూనియన్ సెక్రటరీ అలెక్స్, శ్రీనివాస్, బి. బాపిరాజు, కే అమ్మిరాజు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఓటీటీలో నాలుగు రోజులకే పుష్ప2 రికార్డులు

కాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన పుష్ప2 సినిమా రిలీజై రెండు నెలలైంది. డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులను నెలకొల్పింది. బాహుబలి2 వసూళ్లను సైతం అధిగమించి పుష్పరాజ్ దూసుకెళ్లాడు. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా నాలుగు రోజుల కిందట ఓటీటీలో స్ట్రీమింగ్ కు వచ్చింది.ని నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ కు వచ్చిన పుష్ప2 ఓటీటీలో కూడా రికార్డులను బ్రేక్ చేస్తోంది. పుష్ప2ను స్ట్రీమింగ్ చేస్తున్న సందర్భంగా నెట్ ఫ్లిక్స్ తన అఫీషియల్ ఇన్‌స్టా అకౌంట్ బయోను కూడా మార్చేసింది. దిస్ పేజ్ అండర్ పుష్ప రూల్ అని క్యాప్షన్ ఇవ్వగా, దీంతో పుష్ప రాజ్ నెట్ ఫ్లిక్స్ నే రూల్ చేస్తున్నాడని బన్నీ ఫ్యాన్స్ తెగ సంబరపడిపోయారు. గేమ్ ఛేంజర్ ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్ ఇదిలా ఉంటే ఈ సినిమా మొదటిగా థియేటర్లలో 3 గంటల 21 నిమిషాల నిడివితో రిలీజైంది. తర్వాత మరో 25 నిమిషాల నిడివిని జోడించి మొత్తం 3 గంటల 46 నిమిషాల నిడివితో పుష్ప2 రీలోడెడ్ వెర్షన్ అని రిలీజ్ చేశారు. నెట్ ఫ్లిక్స్ లో రిలీజ్ చేసింది కూడా ఆ రీలోడెడ్ వెర్షనే. తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ భాషల్లో స్ట్రీమింగ్ అవుతున్న పుష్ప2 నెక్స్ట్ లెవెల్ వ్యూస్ తో దూసుకెళ్తుంది. ఈ సినిమా వెస్టర్న్ ఆడియన్స్ ను కూడా ఆశ్చర్యపరుస్తూ, ఏడు దేశాల్లో నెం.1 స్థానంలో దూసుకెళ్తుంది. గ్లోబల్ నాన్ ఇంగ్లీష్ సినిమాల విభాగంలో పుష్ప2 నాలుగు రోజుల్లోనే 5.8 మిలియన్ల వ్యూస్ తో రెండో స్థానంలో ఉండి, తెలుగు సినిమా స్థాయిని మరింత పెంచింది. సుకుమార్ గ్రిప్పింగ్ కథనం, యాక్షన్ సీక్వెన్స్ ల వల్లే ఈ రేంజ్ లో వ్యూస్ పెరుగుతున్నాయని అంతా భావిస్తున్నారు. నాలుగు రోజులకే పుష్ప రాజ్ రూల్ ఈ రేంజ్ లో ఉంటే మరో వారానికి ఇంకా ఏయే రికార్డులను బ్రేక్ చేస్తాడో అని అంతా భావిస్తున్నారు. రష్మిక మందన్నా హీరోయిన్ గా నటించిన ఈ సినిమాలో ఫాహద్ ఫాజిల్ విలన్ గా నటించగా, జగపతి బాబు, రావు రమేష్, అనసూయ, సునీల్ కీలక పాత్రల్లో కనిపించారు. దేవీ శ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ భారీ బడ్జెట్ తో నిర్మించింది.

# కోబలితో మరో విజయం అందుకున్న నిర్మాత తిరుపతి శ్రీనివాసరావు






టి ఎస్ఆర్ మూవీ మేకర్స్ అధినేత తిరుపతి శ్రీనివాసరావు నిర్మించిన కోబలి వెబ్ సిరీస్ ఈ నెల 4 నుంచి డిస్నీ ప్లస్ హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ అవుతోంది ఏడు భాషల్లో విడుదలైన కోబలి.. అన్ని భాషల్లోనూ సూపర్ హిట్ అనిపించుకుంటోంది. ఈ సిరీస్ కు ఇంత మంచి రెస్పాన్స్ రావడం పట్ల నిర్మాత తిరుపతి శ్రీనివాసరావు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.కోడూరు గ్రామానికి చెందిన తిరుపతి శ్రీనివాసరావు టిఎస్ఆర్ అనే బ్యానర్ ను స్థాపించి ఇంతకు ముందు 'తికమకతాండ'అనే చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రంతో ఆయన కొడుకులను హీరోలుగా పరిచయం చేస్తూ నిర్మించిన తికమకతాండ రెండు తెలుగు రాష్ట్రాల్లో 130కి పైగా థియేటర్స్ లో విడుదలై మంచి విజయం సాధించింది. తర్వాత స్ట్రీమింగ్ పార్టనర్ ఆహాలోనూ ఆకట్టుకుంటోంది.మొదటి సినిమా ఇచ్చిన ఉత్సాహంతోనే కోబలి వెబ్ సిరీస్ ను నిర్మించారు. ఈ సిరీస్ ప్రపంచ వ్యాప్తంగా ఏడు భాషల్లో విడుదలైంది. వీటిలో తెలుగు , హిందీ , తమిళ్ , మలయాళం , కన్నడ , బెంగాలీ , మరాఠీ భాషల్లో డిస్నీ హాట్ స్టార్ లో స్ట్రీమ్ అవుతోందిప్పుడు. 'కోబలి' సిరీస్ లో రవి ప్రకాష్, రాకీ సింగ్, తరుణ్ రోహిత్, శ్రీతేజ్, శ్యామల, యోగి ఖత్రి తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఫ్యాక్షన్ డ్రాప్ లో రివెంజ్ యాక్షన్ డ్రామాగా రూపొందిన ఈ సిరీస్ కు ఆడియన్స్ నుంచి గొప్ప స్పందన వస్తోంది. డిస్నీ ప్లస్ లో ఇలాంటి కంటెంట్ ఇంతకు ముందు చూడలేదు అనేలా యాక్షన్ సీక్వెన్స్ లను రూపొందించారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే ఈ రివెంజ్ డ్రామాలోని ఇంటెన్స్ కు ప్రేక్షకులకు ఫిదా అవుతున్నారు. రేవంత్ లెవక డైరెక్ట్ చేసిన ఈ సిరీస్ తో ఇన్నాళ్లూ క్యారెక్టర్ ఆర్టిస్ట్ గానే కనిపించిన రవి ప్రకాష్ మెయిన్ లీడ్ కు వచ్చి అద్భుతంగా ఆకట్టుకున్నాడు. యాక్షన్, ఎమోషనల్ సీన్స్ లో అతని నటన కట్టిపడేస్తుంది. ఫ్యాక్షన్ నేపథ్యంలో సినిమాల్లో రివెంజ్ అనేది కామన్ గానే ఉన్నా.. ఈ సిరీస్ లోని రివెంజ్ కు సంబంధించిన ప్లాట్ సరికొత్తగా ఉండటంతో ప్రేక్షకులు మరింత థ్రిల్ అవుతున్నారు.




Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**